Follow: @ANNTELUGU
08-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 184 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సింగరేణికి మరో రెండు బొగ్గు బ్లాక్‌లు..!

నైనీ, తాడిచెర్ల2 కేటాయింపునకు కేంద్రం నిర్ణయం. రూ.75 వేల కోట్ల ఆదాయ అవకాశమని కిషన్‌రెడ్డి వెల్లడి.

02

టాప్ న్యూస్



### డియంపై కొండాసురేఖ గరం

సీఎం ముందు పంచాది

సీఎం రేవంత్‌కు మూడు పేజీల ఫిర్యాదు లేఖ

02



### భారత్, ఇండోనేసియా కలిస్తే..

'కుచ్ కుచ్' కాదు- 'బహుత్ కుచ్' ప్రధాని మోదీ కామెంట్స్

02



### మెస్సీ ప్రపంచ రికార్డ్

వరల్డ్ కప్ చరిత్రలో 31 మ్యాచ్‌ల్లో స్టార్టింగ్ ఎలెవన్‌లో స్థానం

03

# ఇంత నిర్లక్ష్యమా!

**కోర్టు ఆదేశాలు బేఖాతరు.. '22(ఏ)' నిబంధనలకు పాతర!**

నిషిద్ధ జాబితాలో ఉన్నా నిమ్మకు నీరెత్తిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ యంత్రాంగం!


సర్వే నంబర్ 11/33, 11/34 లలో గ్రీన్ మ్యాట్ చాటున అక్రమ సామ్రాజ్యం!

'ప్రజావాణి'కి చేరిన బిల్డర్ల అరాచకం.. చర్యలకు వెనుకాడుతున్న అధికారులు!

భూ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన హైడ్రా ఎక్కడ..?

## ఖానామేట్‌లో రూ.100 కోట్ల ప్రభుత్వ భూమి స్వాహా!





శేరిలింగంపల్లి మండలం ఖానామేట్‌లో ప్రభుత్వ భూమిపై భూ మాఫియా పంజా విసిరింది.. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉండటంతో, మార్కెట్ విలువ ప్రకారం వంద కోట్ల పై మాటే పలికే ప్రభుత్వ భూమిపై కబ్జాల పరంపర కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిషిద్ధ ఆస్తుల జాబితాలో ఉండటంతో పాటు న్యాయస్థాన పరిధిలో వివాదం కొనసాగుతున్న భూమిలోనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీ కమర్షియల్ నిర్మాణాలు వెలుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ యంత్రాంగాలు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైటెక్ సిటీ–కూకట్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా, వాటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన హైడ్రా సైతం పట్టించుకోకపోవడంతో భూ మాఫియా పెట్రేగిపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్

**కేసీఆర్ పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి**

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదు
- ఇసుకపై బ్యారేజీలు కట్టారు.. బ్యారేజీలు చూపి బంగాళాఖాతం తెచ్చినంత బిల్డప్ ఇచ్చారు

03

- అబద్ధాలతో మభ్య పెట్టడమే కేసీఆర్, కేటీఆర్ నైపుణ్యం





కాకినాడ చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్

## డీఎస్పీ తిలక్ కీలక విజ్ఞప్తి

- నెల రోజులుగా అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి
- పాపను క్షేమంగా అప్పగించాలని పోలీసుల విజ్ఞప్తి
- తీసుకెళ్లిన వారిపై చర్యలుండవని డీఎస్పీ హామీ
- సమాచారం ఇచ్చిన వారికి రూ.1 లక్ష రివార్డు



02

# ప్రజాప్రతినిధి ముసుగులో భూస్వాహా

- బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ 'కబ్జా' పర్వం!
- ప్రజాసేవకుడా? లేక భూములు కొల్లగొట్టే వేటగాడా?
- అదిలాబాద్ జిల్లాలో సంచలనం రేపుతున్న అసైన్డ్ భూముల దందా
- అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తిన వైనం
- పాయల్ కబ్జాలపై ప్రధాన మీడియాలో కథనాలు








మహా
ప్రభుత్వ భూమి @100 కోట్లు
22(ఏ)లో ఉన్నా ఆగని అక్రమ నిర్మాణాలు
కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ డోంట్ కేర్
ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం.. రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించాలంటున్న స్థానికులు

### ఉన్నతాధికారుల సీరియస్.. నివేదికలకు ఆదేశం!

సోమవారం 'ప్రజావాణి' వేదికగా ఆంజనేయులు, భాస్కర్ సారథ్యంలో స్థానికులు సమర్పించిన పక్కా ఆధారాలు, రికార్డులపై ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. ప్రజావాణి ఫిర్యాదులకు తోడు మీడియాలో వచ్చిన కథనాలతో రంగంలోకి దిగిన ఉన్నత శ్రేణి అధికారులు.. క్షేత్రస్థాయిలో అసలేం జరుగుతుందో నివేదిక ఇవ్వాలంటూ శేరిలింగంపల్లి రెవెన్యూ, కూకట్‌పల్లి జోనల్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోర్టు స్టే ఆర్డర్లు, రిజిస్ట్రేషన్ నిషేధిత చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, వందలాది మంది కార్మికులతో పగలు, రాత్రి తేడా లేకుండా భారీ మిక్సర్లతో పనులు ఎలా సాగిస్తున్నారనే ప్రశ్నలకు స్థానిక అధికారులు సమాధానం చెప్పుకోలేక నీళ్లు నములుతున్నారు.


మహా
epaper.mahaadaily.com
ప్రభుత్వ భూమి @100 కోట్లు

# ఇంత నిర్లక్ష్యమా!

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కూకట్పల్లి జోనల్ పరిధిలోని ఖానామేట్ నడిబొడ్డున సాగుతున్న 'సర్కారు ల్యాండ్' శఠగోపం వ్యవహారం మహా పత్రిక వరుస కథనాలతో ఇప్పుడు రంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. 'రియల్ మాఫియా అరాచకం'పై గత రెండు రోజులుగా ప్రచురితమైన కథనాలు క్షేత్రస్థాయి నుంచి కలెక్టరేట్ వరకు కుదిపేయడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బుట్టా కన్వెన్షన్ ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 11/33, 11/34లలోని నిషిద్ధ 22(A) భూమిలో యాదేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణాల వెనుక అసలు సూత్రధారులు, పాత్రధారుల గుట్టు రట్టవుతుండటంతో రియల్ మాఫియాలో వణుకు మొదలైంది.

**సీఎం శాఖలోనే ఇంత నిర్లక్ష్యమా..?**

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ స్వయంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నా ఏ ఒక్క అధికారీ చర్యలు తీసుకోకపోవడం, స్థానికుల నుంచి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు వచ్చినా అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందనే పలు విమర్శలకు బలం చేకూరుస్తుంది . ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో సంబంధిత శాఖలు వహిస్తున్న ఈ ఘోర నిర్లక్ష్యం కబ్జాదారులకు మరింత ఊతమిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సీఎం పరిధిలోని శాఖలోనే ఈ స్థాయి 'ముదుపుల మౌనం' సాగుతుండటం ఇప్పుడు సీఎంఓ దృష్టికి కూడా వెళ్లినట్లు గట్టి ప్రచారం సాగుతోంది.

**భూ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన హైడ్రా ఎక్కడ..?**

నిన్న మొన్నటి వరకు చెరువుల కబ్జాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లతో విరుచుకుపడి, ల్యాండ్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన హైడ్రా .. ఇప్పుడు ఖానామేట్‌లో వందల కోట్ల ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురవుతుంటే ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. చట్టాన్ని ఇంత బహిరంగంగా ధిక్కరిస్తూ, గ్రీన్ మ్యాట్ల చాటున భారీ కాంక్రీట్ మిక్సర్లు పెట్టి బహుళ అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు సాగిస్తుంటే .. అక్రమ కట్టడాల కూల్చివేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన హైడ్రా యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక మతలబు ఏంటని స్థానికులు నిలదీస్తున్నారు. సామాన్యుల నిర్మాణాలపై ప్రతాపం చూపే మున్సిపల్ విభాగాలు ఈ వందల కోట్ల అక్రమ సామ్రాజ్యాన్ని చూసీచూడనట్లు వదిలేశాయి కాబట్టే.. ఇప్పుడు అందరి కళ్ళూ హైడ్రా వైపే చూస్తున్నాయి.






### క్రిమినల్ కేసులకు రంగం సిద్ధం?

మరోవైపు కోర్టు పరిధిలోని వివాదాస్పద భూమిలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దురాక్రమణకు తెగబడిన సదరు బిల్డర్లపై కోర్టు ధిక్కరణ తో పాటు పక్కా క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ఉన్నతాధికారులు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వినికిడి. ప్రభుత్వ భూమిని కాపాడటంలో విఫలమై, ల్యాండ్ మాఫియాకు పరోక్షంగా సహకరించిన లంచగొండి అధికారుల ఉఅధికారులకు కూడా ఎసరు వచ్చేలా విచారణాస్త్రం సిద్ధమవుతోంది. ప్రజాధనానికి గండి కొడుతున్న ఈ ముఠా ఆట కట్టించే వరకు, సర్కారు ల్యాండ్‌కు రక్షణ కల్పించే వరకు ఈ పోరాటం ఆగేది లేదని స్థానిక సామాజిక కార్యకర్తలు, మండలం ప్రజలు హెచ్చరిస్తున్నారు. దశాబ్దాల కాలంగా ప్రభుత్వ ఆస్తిగా ఉన్న ఈ కోట్లాది రూపాయల స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి 'యాక్షన్ ప్లాన్' అమలు చేయబోతుందో వేచి చూడాలి.

**నోటీసుల డ్రామా వద్దు.. జెసిబిలతో రంగామాలోకి దిగాల్సిందే!**

సాధారణంగా ఒక పేదవాడు లేదా మధ్యతరగతి వ్యక్తి చిన్న రేకుల షెడ్డు వేసుకుంటేనే వంద నిబంధనలు చూపిస్తూ జెసిబిలతో విరుచుకుపడే టౌన్ ప్లానింగ్ అధికారులు .. 4 వేల చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని దిగమింగుతుంటే కళ్లు మూసుకోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. నామమాత్రపు నోటీసులతో కాలయాపన చేస్తూ కట్టడాలు పూర్తయ్యేలా కబ్జాదారులకు సమయం ఇచ్చే 'లోపాయికారీ' ఒప్పంధాలను ఉన్నతాధికారులు భగ్నం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, తక్షణమే నిర్మాణ పనులను సీజ్ చేసి, సదరు అక్రమ కమర్షియల్ కాంప్లెక్స్‌ను నేలమట్టం చేయాలని శేరిలింగంపల్లి మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# డియంపై కొండాసురేఖ గరం

**సీఎం ముందు పంచాది**

**హైదరాబాద్, మహా** మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. కడియం శ్రీహరిపై ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అయిన తనకే కనీస సమాచారం ఇవ్వకుండా... ఆ శాఖ ఉన్నతాధికారులతో కడియం ఏకంగా అధికారిక సమీక్ష నిర్వహించారంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లేఖ రాస్తూ అధికారికంగా ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలను, మంత్రిగా తన అధికార పరిధిని పూర్తిగా బేఖాతరు చేశారని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, కీలక నిర్ణయాలు, అధికారిక సమీక్షలన్నీ పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకే వస్తాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. కానీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని... దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భూముల పరిరక్షణ వంటి అంశాలపై సమీక్ష చేశారని లేఖలో మండిపడ్డారు. అంతేకాకుండా అధికారులకు డెడ్‌లైన్లు కూడా పెట్టడం పరిపాలనా పరంగా తీవ్ర అభ్యంతరకరమని, ఇది ప్రభుత్వ 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్ఫూర్తిని నిలువునా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న కడియం శ్రీహరికి... శాఖాపరమైన నిర్ణయాలు మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలనే కనీస విషయం తెలియదా అని కొండా సురేఖ నిలదీశారు. తనను పూర్తిగా పక్కనపెట్టి ఇలాంటి సమీక్షలు చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయానికి కారణమవుతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని... అలాగే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కొండా సురేఖ కోరారు.

# సింగరేణికి మరో రెండు బొగ్గు బ్లాక్‌లు..!

**ఢిల్లీ, మహా.:** సింగరేణి కాలరీస్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం మరో కీలక ఊరటనిచ్చింది. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌తో పాటు తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించాలని నిర్ణయించినట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ రెండు బొగ్గు గనులు సంస్థ భవిష్యత్తు విస్తరణకు, ఉత్పత్తి పెంపుకు కీలకంగా మారనున్నాయని ఆయన తెలిపారు.ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి, సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని చెప్పారు. దేశంలో బొగ్గు అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలాల్లో కూడా సింగరేణి పోటీ పడేలా కేంద్రం సహకారం అందిస్తోందని వెల్లడించారు.

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో మరో 35 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ గని ద్వారా సింగరేణికి దీర్ఘకాలికంగా బొగ్గు ఉత్పత్తి కొనసాగడంతో పాటు సుమారు రూ.75 వేల కోట్ల మేర ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా వేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వానికి ఈ బ్లాక్ కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నైనీతో పాటు తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ బ్లాక్ అందుబాటులోకి రావడం వల్ల సంస్థ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుందని, భవిష్యత్తు అవసరాలను తీర్చేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. తె



లంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారంగా సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి పెరగడం ద్వారా సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ఉద్యోగ భద్రత, పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఇది ఉపయోగపడుతుందని వివరించారు.

కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణి కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరాలో సింగరేణి పాత్ర మరింత పెరగనుండగా, సంస్థ దీర్ఘకాల వృద్ధికి ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కాకినాడ చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ ... డీఎస్పీ తిలక్ కీలక విజ్ఞప్తి


**తుని,మహా** తూర్పు గోదావరి జిల్లాలో నెల రోజులకు పైగా అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో పోలీసులు కీలక ప్రకటన చేశారు. పాప ఎవరి వద్దనైనా ఉంటే, ఎలాంటి భయం లేకుండా క్షేమంగా తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అలా అప్పగించిన వారిపై చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకోబోమని తుని డీఎస్పీ తిలక్ హామీ ఇచ్చారు. తుని మండలం సీహెచ్ అగ్రహారంలోని పామాయిల్ తోటలో కాపలాగా పనిచేస్తున్న సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి, జూన్ 6న అదృశ్యమైన విషయం తెలిసిందే. తల్లి వంట చేస్తున్న సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న పాప కనిపించకుండా పోయింది. కుటుంబానికి చెందిన పెంపుడు కుక్కతో కలిసి కొండ వైపు వెళ్లినట్లు ఓ గ్రామస్థుడు చూసినా, ఆ తర్వాత కుక్క మాత్రమే ఒంటరిగా తిరిగి వచ్చింది. మంగళవారం తునిలో డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడుతూ, పాప ఆచూకీయే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. సమాచారం అందిస్తే తామే స్వయంగా వచ్చి పాపను తీసుకుంటామని తెలిపారు. చుట్టుపక్కల తోటలు, కొండ ప్రాంతాల్లో గాలించినా జంతువుల దాడి ఆనవాళ్లు లభించలేదని, అందుకే కిడ్నాప్ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సెల్‌ఫోన్లు వాడని వ్యక్తులపై దృష్టి సారించినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఇప్పటికే ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, అటవీ సిబ్బంది, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్లతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పాప ఆచూకీ తెలిపిన వారికి రూ.1 లక్ష రివార్డు ప్రకటించారు. కేసు దర్యాప్తులో భాగంగా పెంపుడు కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చినా, అది కూడా ఆ తర్వాత మృతి చెందింది. నెల రోజులు గడిచినా పాప ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

# హస్తకళలకు పవన్ కల్యాణ్ పెద్దపీట..!

**విజయవాడ, మహా.:** ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం మాదిరిగానే "హస్తకళల పర్యాటకం"ను అభివృద్ధి చేసి, కళాకారుల నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కళాకారుల సంక్షేమం, సంప్రదాయ కళల పరిరక్షణ, ఆధునిక మార్కెటింగ్, అంతర్జాతీయ ప్రచారం, ఆరోగ్య భద్రత, డిజిటల్ గుర్తింపు వంటి అంశాలను సమన్వయం చేస్తూ సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో లేపాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం-2026"ను మంగళవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన హస్తకళాకారులు ప్రదర్శించిన కళాఖండాలను పరిశీలిస్తూ ప్రతి స్టాల్‌ను సందర్శించారు. కళాకారులతో మమేకమై వారి సమస్యలు, అవసరాలు, మార్కెట్ పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. హస్తకళలు కేవలం కళాకృతులు కాదని, అవి మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్రకు ప్రతీకలని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆలయాల సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్రణాళికలు ఉన్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లోని హస్తకళా గ్రామాలు, కళాకారుల కేంద్రాలను అనుసంధానిస్తూ ప్రత్యేక "హస్తకళల పర్యాటక సర్క్యూట్"ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

# భారత్, ఇండోనేసియా కలిస్తే.. 'కుచ్ కుచ్' కాదు 'బహుత్ కుచ్ ప్రధాని మోదీ కామెంట్స్

**ఢిల్లీ, మహా :** ఇండోనేసియా అధ్యక్షుడు ప్రభోవో సుంబియాంటోను "భారతదేశానికి నిజమైన స్నేహితుడు" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఇండోనేసియా ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలకు, హృదయపూర్వక స్వాగతానికి తాను ముగ్ధుడినయ్యాయని అన్నారు. మంగళవారం జకార్తాలో జరిగిన ప్రవాస భారతీయుల కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండోనేసియాలో హిందీ పాట 'కుచ్ కుచ్ హోతా హై'కి ఉన్న ప్రజాదరణను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత్, ఇండోనేసియా కలిసి ముందడుగు వేసినప్పుడు, అది కేవలం 'కుచు కుచ్'కే పరిమితం కాకుండా, 'బహుత్ కుచ్'కు దారితీస్తుందని అన్నారు.



# మెస్సీ ప్రపంచ రికార్డ్

మహా : అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. అట్లాంటాలో ఈజిప్టుతో జరుగుతున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా, వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధికంగా 31 మ్యాచ్‌ల్లో స్టార్టింగ్ ప్లేయర్‌గా ఆడిన ఆటగాడిగా మెస్సీ నిలిచాడు. గత వారం కేప్ వెర్డెతో జరిగిన మ్యాచ్‌లో మెస్సీ తన 30వ స్టార్ట్‌తో అమెరికా మహిళా దిగ్గజం క్రిస్టిన్ లిల్లీ రికార్డును సమం చేశాడు. ఆ మ్యాచ్‌లో 20వ ప్రపంచకప్ గోల్ సాధించిన మెస్సీ , వరుసగా ఎనిమిదో వరల్డ్ కప్ మ్యాచ్‌లోనూ గోల్ కొట్టి రికార్డును పొడిగించుకున్నాడు. ప్రస్తుతం 39 ఏళ్ల మెస్సీ 31వ స్టార్ట్‌తో ఈ రికార్డును పూర్తిగా తన సొంతం చేసుకున్నాడు.


శ్రీమతికి ప్లాట్ల బహుమతి

# ప్రజాప్రతినిధి ముసుగులో భూస్వాహా

**తెలంగాణ బ్యూరో, మహా :** ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి, ఆశ్రిత పక్షపాతానికి, అక్రమార్జనకు పాల్పడితే సమాజం ఏమైపోవాలి? ప్రజల సొమ్మును, పేదల భూములను కాపాడాల్సిన బాధ్యత కలిగిన పదవిలో ఉండి, స్వయంగా భూ కబ్జాకు పాల్పడటంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఆదిలాబాద్ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు సంబంధించిన భూబాగోతంపై తాజాగా పలు మీడియాలలో కథనాలు రాగా, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి.

**అక్రమాల పునాదులపై ఆస్తుల సౌధం**

ఆదిలాబాద్ మండలంలోని బట్టిసవర్గం గ్రామ పరిధిలో, నూతన కలెక్టరేట్ భవనానికి కూతవేటు దూరంలో ఉన్న సుమారు ఏడెకరాల విలువైన అసైన్డ్ భూమిని, మరో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని తన భార్య పేరుతో పాయల్ శంకర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఒక ప్రజాప్రతినిధి స్థాయి వ్యక్తి, చట్టాలకు అతీతంగా వ్యవహరించి, ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత ఆస్తులుగా మార్చుకోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.




**చట్టాన్ని బేఖాతరు చేసిన వైనం**

నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములను అమ్మడానికి, కొనడానికి వీలులేదు. గతంలోనే ఈ భూములకు సంబంధించి నిలిపివేత ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి, ఏకంగా ప్లాట్లుగా మార్చి రిజిస్ట్రేషన్లు చేయించడం ఆయన అధికార దర్పానికి నిదర్శనం. అంతేకాకుండా, గతంలో రద్దయిన ఎన్ఓసీ ని మళ్ళీ తెరపైకి తెచ్చి, అధికారులను మేనేజ్ చేసి, ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను పూర్తి చేయించడం వెనుక పెద్ద కుట్ర ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు రూ. 5 కోట్ల విలువైన 11 ప్లాట్లను తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న పాయల్ శంకర్, ప్రజలకు ఏమి సమాధానం చెబుతారు? అధికారుల సహకారంతో నకిలీ రికార్డులను సృష్టించి, పేద రైతుల అసైన్డ్ భూములను కొల్లగొట్టిన వైనం, ఆ ప్రజాప్రతినిధి నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది.

**ప్రశ్నించని అధికారులు**

ఏ బాధ్యతాయుతమైన అధికారి అనుమతితో ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయనేది ఇప్పుడు అతి పెద్ద ప్రశ్న. రాజకీయ ఒత్తిళ్లకు లోబడి, ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే కళ్లు మూసుకుని కూర్చున్నారా? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భూభారతి పోర్టల్‌లో ఆంక్షలు ఉన్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని, బాధ్యులు





# మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీలో కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. విద్యుత్ లైన్ లను సింగల్ ఫేస్ నుండి త్రీ ఫేస్ కి మార్చాలని, పోల్స్ షిఫ్టింగ్ చేయాలని, స్ట్రీట్ లైట్స్ మార్చాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ, బంగారు మైసమ్మ దేవాలయం అభివృద్ధి, పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన కాలనీల సమస్యలను సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి వారితో సమన్వయం చేపిస్తూ, ఎలక్ట్రికల్ ఏ డి తో ఫోన్ లో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలనీ, సంబంధిత అధికారులకు సూచించారు.

# రూ.360 కోట్లతో రెవెన్యూ సేవలకు కొత్త శకం..!

- రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం.
- ప్రజలకు వేగవంతమైన సేవలే లక్ష్యమన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మహా.:** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను ఆధునికీకరించి ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అద్దె భవనాలు, శిథిలావస్థలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు రూ.360 కోట్ల భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. తొలి విడతలో 10 రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాలు, 53 రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

మంగళవారం భవనాల నిర్మాణ పురోగతిపై అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు గౌరవప్రదమైన వాతావరణంలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగడం వల్ల ప్రజలు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తొలి విడతలో 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల నిర్మాణానికి రూ.263 కోట్లను కేటాయించిన ప్రభుత్వం, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాల నిర్మాణానికి మరో రూ.97 కోట్లను మంజూరు చేసింది. మొత్తంగా రూ.360 కోట్లతో ఈ నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకోనున్నాయి. విశాలమైన వేచివుండే హాలులు, డిజిటల్ సేవల కోసం ప్రత్యేక విభాగాలు, రికార్డుల భద్రతకు ఆధునిక సౌకర్యాలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, సాంకేతిక మౌలిక వసతులతో ఈ కార్యాలయాలను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్మాణాలు చేపడుతున్నామని ప్రభుత్వం పేర్కొంది.

ఈ ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలో హౌసింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని భూముల గుర్తింపు, రూపకల్పన, నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ సేవలను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే మరో కీలక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 సమీకృత క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రైవేటు నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులు చేపడుతున్నామని, నిర్మాణంతో పాటు ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతను కూడా ఆయా సంస్థలే భరిస్తాయని వివరించారు. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో శంకుస్థాపనలు పూర్తై నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ వ్యవస్థలను ఆధునికీకరించడం ద్వారా ప్రజల సమయం, వ్యయాన్ని తగ్గించడమే కాకుండా పారదర్శకతను పెంపొందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఈ శాశ్వత భవనాల నిర్మాణం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మెగా పొలిటికల్ సునామీ.

**హైదరాబాద్, మహా.** తెలంగాణ రాజకీయ చదరంగంలో ఇప్పటివరకు మనం చూసింది ఒక ఎత్తు.. ఇకపై చూడబోయేది మరో ఎత్తు! దశాబ్దాలుగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల చుట్టూ గిరికీలు కొడుతున్న తెలంగాణ రాజకీయాల్లోకి ఇప్పుడు ఒక "కొత్త తుఫాను" దూసుకురాబోతోందా? ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను శాసించి, చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో వందశాతం స్ట్రైక్ రేట్ తో రికార్డు సృష్టించిన జనసేనాని, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్... ఇప్పుడు తెలంగాణపై కన్నేశారా? అవుననే అంటున్నాయి తాజా రాజకీయ పరిణామాలు! నిశ్శబ్దంగా సాగుతున్న ఈ మార్పులు, లోపాయికారీగా జరుగుతున్న సమీకరణాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో మహా సంచలనంగా మారాయి. ఇది కేవలం ఒక పార్టీ విస్తరణ కాదు.. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయగల నయా పొలిటికల్ సునామీ అని పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

**ఆంధ్రాలో అఖండ విజయం...**
**తెలంగాణలో ప్రకంపనలు!**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయఢంకా మోగించి, ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారి, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా పీఠం అధిష్టించడం దేశవ్యాప్తంగా రాజకీయ పండితులను విస్మయానికి గురిచేసింది. ఆ "ఆంధ్రా విజయం" ఇప్పుడు తెలంగాణ జనసైనికుల్లో వంద రెట్ల ఉత్సాహాన్ని నింపుతోంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ లాంటి మహా నగరాలతో పాటు ఖమ్మం, నల్గొండ, వరంగల్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో జనసేన గ్రాఫ్ అమాంతం పెరుగుతోంది. ఈ పట్టణ, అర్ధపట్టణ ప్రాంతాల్లో జనసేన కార్యకలాపాలు ఎవరికీ కనిపించకుండానే చాపకింద నీరులా విస్తరిస్తున్నాయన్నది కాదనలేని సత్యం!

యువత గుండెల్లో పవన్ మేనియా... డిజిటల్ వేదికగా మహా ప్రభంజనం! పవన్ కళ్యాణ్ కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదు, యువతకు ఒక ఎమోషన్! ఆయన ఎంచుకున్న సిద్ధాంతాలు ఇప్పుడు తెలంగాణ యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. యువతకు కావాల్సిన ఉద్యోగాలు, పారదర్శక పాలన, అవినీతి రహిత సమాజం గురించి పవన్ చేసే నినాదాలు ఇక్కడి యూత్‌కి బలంగా కనెక్ట్ అవుతున్నాయి. దీనికి తోడు సనాతన ధర్మం, సంస్కృతి పరిరక్షణ, జాతీయత వంటి సున్నితమైన, బలమైన అంశాలపై పవన్ రాజీలేని పోరాటం తెలంగాణలో సరికొత్త చర్చకు దారితీసింది. డిజిటల్ వేదికలపై పవన్ కళ్యాణ్ ప్రసంగాలకు వస్తున్న అద్భుతమైన స్పందన చూస్తే ఏ రాజకీయ పార్టీకైనా వణుకు పుట్టాల్సిందే. ఈ సోషల్ మీడియా సైన్యమే రేపటి రోజున పార్టీకి బలమైన పునాది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కమిషన్ల కోసమే
# కాళేశ్వరం ప్రాజెక్ట్



**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని.. ఆ కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేసీఆర్ తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని ఆయన విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ఆయన తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని ఆరోపించారు.

**కేసీఆర్ కేటీఆర్ ఇంజనీర్లు కాదు.. మానిప్యులేటర్లు**

కాళేశ్వరం తన ‘బ్రెయిన్ చైల్డ్’ అని కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారని, ఆ అబద్ధాలను నాటి గవర్నర్ కూడా గుడ్డిగా నమ్మారని సీఎం ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్ధాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. ఆ విషయంలో వారికి వారే సాటి అని ఎద్దేవా చేశారు.

**నివేదిక ఆధారంగా చర్యలు**

ప్రాజెక్టుల నిర్మాణంలో ఏ దశలోనూ నిబంధనలు పాటించలేదని, భూమి లోపల ఉన్న బలాన్ని పరీక్షించమని ఎన్‌డీఎస్ఏ చెప్పినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం అన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరుగుతోందని, జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ ఇప్పటికే కేసీఆర్, హరీశ్ రావులతో పాటు అధికారులను విచారణకు పిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ విచారణ నివేదిక రాగానే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మరోవైపు ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు సీఎం. అబద్ధాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని ఆయన చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి మరీ యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు.

**ఏడాదికే లోపాలు బట్టబయలు**

ప్రాజెక్టు చేపట్టిన ఏడాదిలోనే నిర్మాణ లోపాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ వద్ద సీసీ బ్లాకులను సరిచేయాలని ప్రాజెక్టు ఈఈ రమణారెడ్డి 2020లోనే కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని పేర్కొన్నారు. కానీ, నాటి ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని, నిర్మాణ సంస్థ కూడా మరమ్మతులు చేయలేదన్నారు. ఫలితంగా 2022 గోదావరి వరదలకు కన్నెపల్లి పంపుహౌస్‌లు మునిగిపోయాయని అన్నారు. ఆ వెంటనే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఆరు పిల్లర్లు కుప్పకూలాయని సీఎం రేవంత్ వివరించారు. సాధారణంగా ఏవైనా బ్యారేజీలు లేదా డ్యామ్‌లు కడితే వాటిని విడతల వారీగా 25 శాతం చొప్పున నీటిని నింపుతూ పరీక్షిస్తారని, కానీ కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదే బ్యారేజీలను పూర్తిగా నింపేశారని మండిపడ్డారు. అసలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, కేవలం ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల, హడావుడిగా నీళ్లు నింపడం వల్ల ఒత్తిడి పెరిగి ప్రాజెక్టు కుంగిపోయిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## బుధవారంయూఎల్‌సీ భూముల రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించాలి

**కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్‌లోని బీఎన్ రెడ్డి నగర్‌లో సుమారు 150 ఎకరాల యూఎల్‌సీ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తమ సొంత ఆస్తులపై హక్కులు వినియోగించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రిజిస్ట్రేషన్లు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నిబంధనలకు అనుగుణంగా సమస్యను సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

## బహదూర్ గుడా రైతుల

**పట్టాల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం..**
**ఎమ్మార్వో అమరలింగం గౌడ్...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ లోని బహదూర్ గూడ గ్రామంలో సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు ప్రభుత్వం పట్టా పాస్ బుక్ లు ఇవ్వనున్నట్లు మండల ఎమ్మార్వో అమరలింగం గౌడ్ మంగళవారం తెలిపారు. బహదూర్ గూడ గ్రామంలో 195455 కాస్రా, పహనీ కాటాదార్ వివరాలతో పాటు భూ రికార్డుల ఆధారంగా అర్హులైన 148 రైతుల కుటుంబాలకు సర్వేనెంబర్ 1 నుండి 76 వరకు మొత్తం 1212.24 ఎకరాల విస్తీర్ణంలో భూమిఉంది. అందులో ప్రభుత్వనికి 650 ఎకరాలు వదిలి పెట్టి, 562 ఎకరాలు రైతులకు పట్టా పాస్ బుక్కుల ద్వారా పంపిణీ త్వరలో చేస్తున్నట్లు శంషాబాద్ ఎమ్మార్వో అమరలింగం గౌడ్ పేర్కొన్నారు. అర్హులైన రైతులు ఎమ్మార్వో కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.






# తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ - యూజింగ్ టెక్నాలజీ' దిశగా తెలంగాణ పోలీస్.

***బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలి.**
***సమీక్ష సమావేశంలో డీజీపీ సివి. ఆనంద్.**



**ఖమ్మం,మహా.** 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్ టెక్నాలజీ' అనే లక్ష్యంతో పోలీస్ అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటన లో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్బి కాన్ఫిరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలిసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్బంగా డీజీపీ మాట్లాడుతూ...పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి..ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు. బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలన్నారు చట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని, *స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. CCTNS 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకు గాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలలను కట్టడికి క్షేత్ర స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. "మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావితరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ఛాలెంజ్ గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారిందని, నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారని, ఇది పోలీసులకు సవాలుగా మారిందన్నారు. ఇందులో విద్యావంతులు ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. తెలంగాణలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం, ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి అని డీజీపీ స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు ."అరైవ్ అలైవ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గయని అన్నారు. రోడ్డు భద్రత కోసం ఈగల్ తరహాలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల ధోరణులను, వాటిలో ఉన్న లోపాలను డీజీపీ సమగ్రంగా విశ్లేషించి, దర్యాప్తు నాణ్యత, సత్వర విచారణ, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపుదల ద్వారా మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 2026లో 1,700 కిలోల గంజాయి, 2025లో సుమారు 4,000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు. సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

# సారు.. వస్తున్నారు



తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారబోతున్నాయా? రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ అస్త్ర, శస్త్రాలు సిద్ధం చేసుకుంటోందా? బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఫామ్ హౌస్ కే పరిమితమైన పెద్దాయన బరిలోకి దిగే సమయం ఆసన్నమైందా? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపైన ముప్పేట దాడికి వ్యూహ రచనతో ఇప్పుడు యుద్ధం మొదలవుతోందా? ఎస్.. అంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు హరీష్ రావుతో పాటు కొందరు మాజీ మంత్రులు మాత్రమే కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఎదుర్కొని బీఆర్ఎస్ ను ముందుకు నడిపిస్తూ వస్తున్నారు. అప్పుడప్పుడు కేసీఆర్ బయటకు వస్తున్నా కేవలం బహిరంగ సభల్లో ప్రసంగించి వెళ్లి పోతున్నారు. ఇక ముందు నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగబోతున్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కేసీఆర్ పైన విరుచుకుపడుతున్న నేపథ్యంలో వారికి దీటుగా సమాధానం చెప్పేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టెందుకు పెద్దాయన సన్నద్ధం అయ్యారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కొద్ది రోజుల క్రితం బీఆర్ఎస్ కు చెందిన సీనియర్ నేతలతో సమావేశమైన కేసీఆర్ తెలంగాణలోని రాజకీయ పరిస్థితి, ప్రభుత్వ విధానాలు, పార్టీ అనుసరిస్తున్న విధానంపైన లోతుగా సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఇక తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నట్లు ఈ సందర్భంగా కేసీఆర్ నేతలకు చెప్పినట్లు బీఆర్ఎస్ కు చెందిన ఓ సీనియర్ మంత్రి తెలిపారు. కేసీఆర్ పునరాగమనంతో బీఆర్ఎస్ లో ఊపు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కేసీఆర్ త్వరలో బస్సు యాత్ర చేస్తారని ఇప్పటికే కేటీఆర్ ప్రకటించారు. బస్సు యాత్రకు ముందే తెలంగాణలో మూడు బహిరంగ సభలు ఏర్పాటు చేసే ఆలోచన కూడా టీఆర్ఎస్ చేస్తోంది. ఈ సభల్లో కేసీఆర్ పాల్గొంటారని నేతలు స్పష్టం చేస్తున్నారు. బహిరంగ సభలు ఎక్కడెక్కడ నిర్వహించాలన్న దానిపై కసరత్తులు జరుగుతున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్న జిల్లాలపైన పూర్తి స్థాయి దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్ పెట్టే ఆలోచనలో వుంది. ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , భట్టీ విక్రమార్క, నల్గొండ జిల్లాలో కోమటి రెడ్డి బ్రదర్స్, వరంగల్ లో కడియం శ్రీహరి, మహబూబాబ్ నగర్ జిల్లాలో ఏకంగా సీఎం రేవంత్ రెడ్డిలను టార్గెట్ గా చేసుకొని బీఆర్ఎస్ నేతలు బరిలోకి దిగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో లోపాలు, మంత్రులు చేస్తున్న తప్పిదాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్ళటం, క్షేత్ర స్థాయి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను పెద్ద ఎత్తున ప్రచారం చేయటంపైన బీఆర్ఎస్ ఈ వ్యూహం రూపొందించినట్టు ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ఇక ఢీ అంటే ఢీ అనే స్థాయిలో కేసీఆర్ తో పాటు ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ తో తలపడబోతున్నారు. కాంగ్రెస్ నేతల ఎత్తులకు ఎప్పటికప్పుడు పై ఎత్తులు వేయటం, వచ్చిన ప్రతీ అవకాశం వదలకుండా రాజకీయంగా వినియోగించుకోవటం వంటివి ఇప్పుడు బీఆర్ఎస్ ఎత్తుగడల్లో భాగం కానున్నాయి. ఇప్పటి వరకు సాగిన బీఆర్ఎస్ పోరాటం కేవలం ట్రైలర్ మాత్రమేనని అసలు పోరాటం ముమ్ముందు చూస్తారని బీఆర్ఎస్ నేతలు మీసం మేలేసి మరి చెబుతున్నారు. అంటే మాజీ సీఎం కేసీఆర్ ఓ మెగా ప్లాన్ తోనే రంగంలోకి దిగుతున్నారన్నది వారు చెప్పకనే చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కేసీఆర్ ను తక్కువగా అంచనా వేశారని, వ్యక్తిత్వ హననం చేసి ఆనందం పొందారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహంతో వున్నారు. వీటికి త్వరలో మూల్యం చెల్లించుకునేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధంగా ఉండాలని సవాల్ విసురుతున్నారు. మౌనముద్ర వీడి కేసీఆర్ జనంలోకి వస్తే కాంగ్రెస్ కొంచెం ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొనే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కేసీఆర్ ను తక్కువ అంచనా వేస్తే అది భస్మాసుర హస్తం అవుతుందని వాళ్ళు హెచ్చరిస్తున్నారు. ఆయన ఓ మేధావి, రాజకీయ చాణుక్యుడు. మాటల్లో మేటి. వ్యూహ రచనలో ఘనపాటి. జనాన్ని ఎలా మెప్పించాలో, ఎలా ఒప్పించాలో తెలిసిన నేత. రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టటంలో దిట్ట అంటున్నారు కేసీఆర్ నైజం తెలిసివాళ్ళు. కాంగ్రెస్ నేతల బలం, బలహీనతలు కేసీఆర్ కు పూర్తిగా తెలుసు. ఎప్పుడు ఏ కాంగ్రెస్ నేతను ఎలా ఢీకొట్టి చక్ర బంధంలో చిక్కుకునేలా చేయాలో కేసీఆర్ కు తెలుసని వారు చెబుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఒక్క సీఎం రేవంత్ రెడ్డి తప్పా మిగితా నేతలెవరు కేసీఆర్ ను తట్టుకునే పరిస్థితి లేదని వారు అంచనా వేస్తున్నారు. ఇందులో నిజం లేకపోలేదు. రాజకీయ సంక్షోభాలు కేసీఆర్ కు కొత్తేమి కాదు. ప్రస్తుతం వున్న పరిస్థితి కన్నాఘోరమైన పరిస్థితిని ఆయన ఎదుర్కొన్నారు. కొన్ని సార్లు కేసీఆర్ పని అయిపోయిందనే స్థాయికి కూడా పడిపోయారు. వైస్సార్ సీఎంగా వున్న సమయంలో కేసీఆర్ అధ్యాయం ముగిసిందనే టాక్ కూడా వచ్చింది. ఇలాంటి గడ్డు రోజులను తట్టుకుని ఎగిసి పడిన కెరటంలా మళ్ళీ ఆయన బయటకు వచ్చారు. ఫామ్ హౌస్ లో విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్ ఇప్పటికే కాంగ్రెస్ ను ఎలా ఇంటి బాట పట్టించాలో ఆలోచన చేసే ఉంటారని మేధావులు అంటున్నారు. ఆయన ప్రణాళిక ఎవ్వరికి అంతు చిక్కదని వారు చెప్పుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా తమ బలం అంతా కేసీఆర్ అనే భావనలో వున్నారు. పెద్దాయన బయటకు వచ్చిన రోజు నుంచి కాంగ్రెస్ నేతలు ఇంటికి వెళ్లే ముహూర్తం ఖరారవుతుందని వారు అంటున్నారు.


కేసీఆర్ జనాకర్షణ వున్న నేత.. ఆయన పైన ప్రజలకు అభిమానం వుంది. తెలంగాణ సాధనలో ఆయన పోరాట పటిమ ప్రజలకు బాగా గుర్తుండిపోయింది. ఆయన ప్రసంగం కోసం ఎదురుచూసే వాళ్ళు ఎందరో వున్నారు. జనాలను ఆకట్టుకునే ఆయన శైలీ ఓ ప్లస్ పాయింట్. ప్రసంగంతో కట్టి పడేసే సత్తా వున్న నాయకుడు. ప్రజల్లో గౌరవభావం పొందిన కేసీఆర్ అటు క్లాసు, ఇటు మాస్ లను కట్టి పడేసే మేధావి. ఎదుటి వాళ్ళు ఎంతటి వారైన తన మాటలతో దారికి తీసుకొని వచ్చే నేర్పు కేసీఆర్ సొంతం. మూడేళ్ళ తర్వాత ఇప్పుడు ఆయన తిరిగి ప్రజల్లోకి వస్తున్నారు అంటే జనంలో ఆ క్రేజీ వేరేలా ఉంటుంది. ఇందులో డౌట్ లేదు. మాటల తూటాలు ఇక తెలంగాణలో పేలుతూనే ఉంటాయి. రాజకీయ చతురతతో తెలంగాణలో ఆసక్తికర పరిణామాలు ముమ్ముందు తథ్యంగా కనిపిస్తున్నాయి. సవాళ్ళకు, ప్రతి సవాళ్ళకు, ఘాటు విమర్శలు, ఆరోపణలు తారా స్థాయికి చేరిన సమయంలో కేసీఆర్ రీఎంట్రీ మరింత హీట్ పుట్టించే అవకాశం వుంది. కాంగ్రెస్ నేతలు,మంత్రులు, సీఎం తనపై చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు కేసీఆర్ తనదైన శైలీలో జవాబు ఇచ్చే వాతావరణం కనిపిస్తోంది.కేటీఆర్, హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు, సీనియర్ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పై ముప్పేటదాడి చేస్తున్నారు. గాలి, దుమారంలా కేసీఆర్ కూడా విరుచుకు పడేందుకు రెడీ అవుతున్నారు. బీఆర్ఎస్, తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్న సవాళ్ళతో కాంగ్రెస్ నేతలు క్షణం తీరిక లేకుండా ఖండనల పర్వం సాగిస్తున్నారు. కేసీఆర్ కూడా రంగంలోకి దిగితే కాంగ్రెస్ నేతలు నిద్రాహారాలు వదిలి కదనరంగంలోకి దిగక తప్పదు.

కేసీఆర్ తో పాటు ఆయన టీంను దీటుగా ఎదుర్కొనే శక్తి తెలంగాణ కాంగ్రెస్ లో ఏ నేతలకుంది అనే ప్రశ్నకు ఒక్కటే సమాధానం వస్తుంది. అది సీఎం రేవంత్ రెడ్డి. సై అంటే సై అనే ధోరణి ఆయనకే వుంది. తన వాగ్దాటితో ప్రత్యర్థులను కలవర పెట్టే రేవంత్ ఎక్కడా వెనక్కితగ్గే అవకాశం లేదు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడే ఆయన ఒంటి చేత్తో నెట్టుకువచ్చారు. సీఎం హోదాలో అనుభవం సంపాదించిన రేవంత్ ఏ అంశంపైనైనా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా వున్నారు. గతంలోనూ కేసీఆర్ ను గట్టిగానే ఢీ కొన్న ఆయన ముమ్ముందు కూడా అదే వైఖరితో పరుగులు తీసే అవకాశం వుంది. అవసరమైతే ఆ స్పీడు కూడా పెంచే సామర్థ్యం రేవంత్ రెడ్డికి వుంది. ఇక ఎన్నికలకు అటు ఇటుగా రెండేళ్ల సమయం వుంది. ఇప్పటి నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్ లు పోటా, పోటీ పడుతున్నాయి. ఇరు పార్టీల నేతలు ఎవరికీ వారే తగ్గకుండా జోరు కొనసాగిస్తున్నారు. మరో వైపు బీజేపీ కూడా ఈ రేసులో తాము వున్నాం అనే సంకేతాలు ఇస్తోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తధ్యమంటూ సీఎం గట్టిగా చెప్పుతున్నారు. కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, కేసీఆర్ మళ్ళీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని కమలనాధులు చెప్పుకుంటూ వస్తున్నారు. మరి కారు జోరు సాగుతుందా? హస్తవాసి ఫలిస్తుందా? కమలం వికసిస్తుందా? తెలంగాణ ప్రజలను ఎవ్వరు ఆకట్టుకుంటారు? ఎవ్వరు నెగ్గుకు వస్తారు. ఇది తేలాలి అంటే రెండేళ్లు ఆగాలి మరి. అప్పటి వరకు తెలంగాణలో పార్టీల జాతర్లతో ప్రజలు ఎంజాయ్ చేయొచ్చు... ఏ నేత సత్తా ఏమిటో అంచనా వేయవచ్చు...




**జి. వెంకటరమణ**
సీనియర్ జర్నలిస్ట్.

# పేద ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్





రాజకీయాలు కేవలం అధికారాన్ని సాధించే ప్రక్రియ మాత్రమే కావు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే బాధ్యత కూడా. కొందరు నాయకులు ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపడతారు. మరి కొందరు అధికారాన్ని ప్రజా సంక్షేమానికి సాధనంగా మలిచి చరిత్రలో తమదైన ముద్ర వేస్తారు. అయితే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని, వారి జీవితాల్లో ఆశను నింపి, తరతరాల పాటు జ్ఞాపకాలలో నిలిచిపోయే నాయకులు మాత్రం అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన ప్రజానాయకుల్లో దివంగత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అగ్రగణ్యుడు. ఆయన జయంతి ఒక మహానేతను స్మరించుకునే సందర్భమే కాదు... ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వ ధర్మంగా, సామాజిక న్యాయాన్ని పాలనా స్ఫూర్తిగా మలిచిన నాయకత్వాన్ని మరోసారి గుర్తు చేసుకునే సందర్భం. డాక్టర్ వైఎస్సార్ రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఆయనకు అధికారం అంతిమ లక్ష్యం కాదు; ప్రజాసేవకు అది ఒక సాధనం మాత్రమే. ప్రజల అవసరాలను తెలుసుకోవడం, వారి సమస్యలను ప్రభుత్వ విధానాల కేంద్రంగా నిలబెట్టడం, పాలనను సామాన్యుడి గడప వరకు తీసుకెళ్లడం ఆయన రాజకీయ తత్వానికి మూలాధారం. అందుకే ప్రజలు ఆయనను కేవలం ముఖ్యమంత్రిగా కాకుండా తమ ఇంటి మనిషిగా భావించారు. వైద్యుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌కు పేదరికం, అనారోగ్యం, రైతు కుటుంబాల నిస్సహాయత కొత్త కాదు. రోగి బాధను దగ్గరగా చూసిన వైద్యుడు, సమాజ బాధను అర్థం చేసుకున్న రాజకీయ నాయకుడిగా ఎదిగారు. ప్రజల సమస్యలను అధికారపు గదుల్లో కాదు, ప్రజల మధ్యకు వెళ్లి తెలుసుకోవాలనే దృక్పథమే ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టింది. ఆ ఆలోచనకు ప్రత్యక్ష రూపమే 2003లో చేపట్టిన ప్రజా ప్రస్థానం. చేవెళ్ల నుంచి ఇచ్చాపురం వరకు సాగిన ఆ చారిత్రక పాదయాత్ర సామాన్య ప్రజల జీవితాలను అర్థం చేసుకునే మహా ప్రయాణంగా నిలిచింది. మండే ఎండలో రైతుల మధ్య నడిచారు. గ్రామీణ పేదరికాన్ని దగ్గరగా చూశారు. విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి వంటి సమస్యలను స్వయంగా విన్నారు. ఆ యాత్రలో ప్రజలు వ్యక్తం చేసిన అవసరాలే తరువాత ప్రభుత్వ నిర్ణయాలకు దిశానిర్దేశం చేశాయి. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త భరోసా కల్పించారు. రైతు సంక్షేమమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాది అనే భావనతో వ్యవసాయాన్ని ప్రభుత్వ ప్రాధాన్య రంగంగా నిలబెట్టారు. రైతు సమస్యను కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా, సమాజ సంక్షేమానికి సంబంధించిన అంశంగా పరిగణించారు. ఆరోగ్య రంగంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పేద కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, 104 గ్రామీణ ఆరోగ్య సేవలు ప్రజారోగ్య రంగంలో విశేషమైన మార్పుకు దోహదపడ్డాయి. ఆరోగ్యం ప్రతి పౌరుడి హక్కు అనే భావనకు ఆయన పాలన బలమైన పునాది వేసింది. విద్యా రంగంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసింది. ఆర్థిక పరిస్థితి కారణంగా చదువు ఆగిపోకూడదనే ఆలోచనతో అమలు చేసిన ఈ కార్యక్రమం అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచింది. ఇందిరమ్మ గృహాలు పేదల సొంతింటి కలను సాకారం చేశాయి. మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించిన ప్రోత్సాహం గ్రామీణ మహిళల్లో ఆర్థిక స్వావలంబనను పెంచింది. మహిళ సాధికారతను కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి కీలకంగా భావించిన పాలనగా వైఎస్సార్ ప్రభుత్వం గుర్తింపు పొందింది. వ్యవసాయానికి నీరే జీవం అన్న నమ్మకంతో ప్రారంభించిన జలయజ్ఞం ఆయన దూరదృష్టికి ప్రతీకగా నిలిచింది. సాగునీటి వసతులను విస్తరించేందుకు అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అమలు తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, సాగునీటి అభివృద్ధిని ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా నిలబెట్టిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. వైఎస్సార్‌ను ప్రజలకు మరింత చేరువ చేసింది ఆయన నిరాడంబర వ్యక్తిత్వం. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ గ్రామాల్లో ప్రజల మధ్య కూర్చొని వారి సమస్యలు వినడం, అధికారులను ప్రజల పక్షాన పనిచేయాలని ఆదేశించడం, నిర్ణయాల్లో మానవీయ దృక్పథాన్ని ప్రతిబింబించడం ఆయన నాయకత్వానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. వైఎస్సార్ వారసత్వం కొన్ని సంక్షేమ పథకాలకే పరిమితం కాదు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలవాలనే ఆలోచనకు ఆయన కార్యరూపం ఇచ్చారు. రైతు, పేద, విద్యార్థి, మహిళ, గ్రామీణ సమాజం అభ్యున్నతినే ప్రభుత్వ విజయానికి అసలైన కొలమానంగా నిలబెట్టారు. అందుకే ఆయన పాలన ముగిసినా, ఆయన ఆలోచనలు నేటికీ ప్రజా చర్చల్లో సజీవంగా ఉన్నాయి. 2009 సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన అకాల మరణం తెలుగు ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. రాష్ట్రం ఒక ముఖ్యమంత్రిని మాత్రమే కాదు, ప్రజలతో ఆత్మీయ బంధం ఏర్పరచుకున్న నాయకుడిని కోల్పోయింది. ఆయన మరణానంతరం వ్యక్తమైన ప్రజా స్పందన ఆయనకు ప్రజల హృదయాల్లో ఉన్న ప్రత్యేక స్థానాన్ని తెలియజేసింది. చరిత్ర నాయకులను వారు అధిష్ఠించిన పదవులతో మాత్రమే కాదు, సమాజంపై వారు చూపిన ప్రభావంతో గుర్తుంచుకుంటుంది. ఆ కొలమానంతో చూసినప్పుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన నాయకుడు. రైతు సంక్షేమం, పేదల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు, మహిళల సాధికారత, గ్రామీణ అభివృద్ధి...ఈ అంశాలన్నింటినీ ప్రభుత్వ విధానాల కేంద్రంగా నిలబెట్టిన ప్రజానేత. కాలం మారినా, రాజకీయాలు మారినా, ప్రజల సంక్షేమాన్ని పాలనకు పరమార్థంగా మలిచిన నాయకుడిగా ఆయన పేరు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.



**- అమరవాజీ నాగరాజు**
**జర్నలిస్టు**



# వైద్యం పేరుతో ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు

**గడ్డం వెంకటేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా** ఃయాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ వైద్యం పేరుతో ప్రజల వద్ద డబ్బులు కాజేస్తూ ప్రజలను జలగల్లా పట్టిపీడిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్యాధికారులు నిఘా పెట్టాలని అలాంటి ఆసుపత్రులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం డివైఎఫ్ఐ ఆలేరు పట్టణ మూడవ మహాసభలో మాజీ పట్టణ కార్యదర్శి బోనగిరి గణేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ప్రభుత్వరంగ వైద్యాన్ని మెరుగుపరచకపోవడం వల్ల అనేకమంది పేద మధ్యతరగతి,ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడిందని పాలకులు ప్రభుత్వాలు మారుతున్న వైద్యం మాత్రం మారడం లేదని జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల ప్రైవేటు ఆసుపత్రులు పుట్టుకొచ్చి ప్రజల రక్తాన్ని వైద్యం పేరుతో పీల్చుతున్నారని కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఆసుపత్రుల నిర్వహణ జరుపుతున్నారని ఇలాంటి ఆసుపత్రులకు అనుమతి ఇవ్వడంలో జిల్లా అధికారుల జోక్యం పెరుగుతుందని జిల్లా అధికారులు నిఘా పెట్టకపోవడం మూలంగా వైద్యం వ్యాపారంగా మారిపోయి ప్రజల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు అన్నారు. ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మరోపక్క ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్న డాక్టర్లను గుర్తించి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వైద్యరంగ సమస్యలపై అనేకమార్లు జిల్లా వైద్యాధికారులకు మొరపెట్టుకున్న కనీసం స్పందన లేదని వారు అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం లేక గాంధీ ఉస్మానియా లాంటి పెద్ద ఆసుపత్రులకు వెళ్ళవలసిన దుస్థితి ప్రమాదం మరింత తీవ్రతను బట్టి మధ్యలోనే ప్రాణాలు పోతున్న పరిస్థితి దాపురించిందని దీనిపై జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీ మంత్రులు కనీసం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు వెంటనే జిల్లా వ్యాప్తంగా వైద్యరంగంపై వైద్యాధికారులు దృష్టి పెట్టి ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడిని ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, మాజీ డివిజన్ అధ్యక్షులు మొరిగాడి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వద్దెమాను విప్లవ, చెన్న రాజేష్, మురిగాడు పృథ్వీ, యాసారపు ప్రసాద్, ఎక్కలదేవి భాస్కర్,రేగుంటి ప్రశాంత్, గద్దల శివకుమార్, మొరిగాడి మహావీర్, మొరిగాడి మౌర్య,ఎర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ మోడల్ స్కూళ్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.. కసుర్బా గాంధీ పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు (సివిల్) పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు, త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు, అనంతరము కేజీబీవి లో తరగతి గదులను పరిశీలించారు.ఆరవ తరగతి విద్యార్థిని చదివించి, అభ్యాసన సమర్థ్యన్ని రాబట్టారు. బాలికల హాస్టల్ గదులను, కిచెన్ షెడ్ ను, వంట సరుకులను పరిశీలించారు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలోమంచి పౌష్టి ఆహారం శుద్ధమైన త్రాగునీరు అందించాలన్నారు. తదనంతరము మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ సందర్శించి ప్రాంగణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించినారు, అక్కడ ఉన్న నిర్వాహకులు కేర్ టేకర్ కావాలని కలెక్టర్ ని కోరారు అనంతరం



మోడల్ స్కూల్ లో తరగతి గదులను పరిశీలిస్తూ, బాలుర,బాలికల మరుగుదొడ్లను పరిశీలించి ప్రిన్సిపల్ రాము పై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు, నిధులు, స్కూల్ గ్రాంట్ వచ్చినా ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని అడిగారు, దీనిపై స్పెషల్ ఎంక్వయిరీ కమిటీని పంపిస్తా అన్నారు, రెండు రోజులలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు, ఎంపీడీవో చండీరాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆర్.విజయలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాము,పి ఆర్ ఏ ఈ ఆర్ దామోదర్,సిడిపిఓ నాజి, సి ఆర్ పి దేవన బోయిన. లింగయ్య పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి నరసింహారెడ్డి మృతి బాధాకరం

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా**

మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి దశ ఉద్యమ కారుడు కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం ఎంతో బాధాకరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజా సేవనే జీవిత ధ్యేయంగా మలచుకున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. నిరాడంబరత, నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావంతో సాగిన ఆయన ప్రజా జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని. కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం తెలంగాణకు, ప్రజా జీవితానికి తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.



# మహనీయుల విగ్రహావిష్కరణ

**పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ , మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ , ఇబ్రహీం పట్నం మాజీ ఎమ్మెల్యే కళ్లెం పాపిరెడ్డిల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాల ఆవిష్కరించి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, కళ్లెం పాపిరెడ్డి వంటి మహనీయులు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల వారు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...



# ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగాపూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా** ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగంగా పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.మంగళవారం బొమ్మలరామారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సమీక్షిస్తూ ఉపాధి హామీ పథకం ( ఎన్జీఈజీఎస్ ) కింద పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, ఉపాధి కల్పన, పనుల నాణ్యత, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేసి, పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రామలింగంపల్లి మరియు తుమ్ముకుంట గ్రామాలను సందర్శించారు రికార్డుల నిర్వహణ , పారిశుధ్యం మీద ప్రత్యేక దృష్టి సారించాలి అని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

**ఎరువుల దుకాణం తనిఖీ**

అనంతరం బొమ్మలరామారం మండలం చికటిమామిడి గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా యూరియా ఎరువు నిల్వలు, సరఫరా, పంపిణీ విధానం, రైతులకు అందుబాటు వంటి అంశాలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎలాంటి అక్రమ నిల్వలు లేదా కృత్రిమ కొరత సృష్టించరాదని దుకాణ నిర్వాహకులకు ఆదేశించారు.వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన యూరియా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి. శ్యామల, మండల పంచాయతీ అధికారి శ్రీమాలిని, వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.



# మాదిగ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**యాదాద్రి భువనగిరి జిల్లా 7 మహా** ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు జండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా చిలకమరీ గణేష్ మాదిగ రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ మాదిగలు నాలుగు శతాబ్దాల నుండి పోరాటం చేసి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదములు తెలియజేస్తూ ఆ తీర్పును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశంలో వర్గీకరణ ప్రకారం మాదిగ మాదిగ ఉపకులాలకు ఎస్సీ కులాల్లో ఉన్నటువంటి జనాభా నిష్పత్తి ప్రకారం సంక్షేమ పథకాలు ఏర్పాటు చేయాలని మరియు ఉద్యోగ నియమకాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల కుటుంబాలను మొదటి అవకాశాలు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు అందుకు ఈ రాష్ట్రంలో అన్ని కులాల కంటే కేవలం ఒక మాదిగ కులం అత్యధిక సంఖ్యలో ఉన్నందున భారత రాజ్యాంగం ప్రకారం 15% రిజర్వేశాన్ని పెంచాలని మరియు మాదిగ ఉద్యమకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డు నర్సింగరావు మాదిగ, సురుపంగా సుగుణ మాదిగ, మరియు జిల్లా కమిటీ సభ్యులు కొండాపురం శ్రీనివాస్ మాదిగ, గంగారం స్వామి మాదిగ, బుచ్చాల వెంకటేష్ మాదిగ, సిలువేరు జంగమ్మ, ప్రమీల, మంగమ్మ, బాలమణి, భార్గవి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



# బిఎల్ఏ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం,అనర్హుల పేర్ల తొలగింపు,వివరాల సవరణ వంటి అంశాలపై బి ఎన్ ఏ లకు సమగ్ర అవగాహన కల్పించారు.

# ఆగస్టు 16, 17, 18 తేదీల్లో భువనగిరిలో జరిగే సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి

**సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపు**

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా** ఆగస్టు 16, 17, 18 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో నిర్వహించబోయే 'సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్' ( సిఐటియు ) రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరి గుట్ట పట్టణంలో రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను స్థానిక శ్రీ లక్ష్మి నరసింహ కొబ్బరికాయల హమాలీ యూనియన్ నాయకులతో కలిసి ఆయన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశాల్లో అఖిల భారత, రాష్ట్ర నాయకత్వంతో పాటు అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొని కార్మిక లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను నయా బానిసలుగా మారుస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో లేబర్ కోడ్స్‌ను బలపరచడం సరికాదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 6 ద్వారా కనీస వేతనాలు సవరించినప్పటికీ, అది శాస్త్రీయంగా లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని విమర్శించారు. అంగన్‌వాడీ ,ఆశా ఉద్యోగులకు కనీస వేతనం రూ. 18,000/ కి పెంచి ప్రతి నెల మొదటి వారంలో చెల్లించాలనీ, ప్రీప్రైమరీ, ఐసిడిఎస్ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకే అప్పగించాలన్నారు. ఆశాలకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. హమాలీ, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలనీ ఆర్టీసీ సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, రాబోయే రోజుల్లో మరిన్ని సమరశీల పోరాటాలకు భువనగిరి సమావేశాల్లో కార్యాచరణ రూపొందించుకోబోతున్నామని కల్లూరి మల్లేశం తెలిపారు. ఈ సమావేశాల విజయవంతం కోసం కార్మికులు, ప్రజలు తమ వంతు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించి తోడ్పడాలని సిఐటియు యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు యాదగిరిగుట్ట పట్టణ కన్వీనర్ సీస శ్రీను, స్థానిక హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కల శ్రీశైలం, చుక్కల పెద్ద వెంకటయ్య,నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.





# కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జులై 7 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు ఈ సందర్భంగా 57 మంది లబ్ధిదారులకు మొత్తం 57,06,612 రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా ఈ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సకాలంలో అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి పట్టణ, మండల, గ్రామాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్**

మహా వరంగల్ క్రైం;పోలీసులు తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం సొంతం చేసుకోవడం ఎంతో కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను మంగళవారం పోలీస్ కమిషనర్ మామూనూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో ప్రారంభించారు.



భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ , ఖమ్మం పోలీస్ కమీషనరేట్ ,మహబూబాబాద్ మరియు భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది డ్యూటీ మీట్ లో భాగంగా కంప్యూటర్ పరిజ్ఞానం,ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్,బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్,ఫోటోగ్రఫీ & వీడియో గ్రఫీ వంటి విభాగాల్లో సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబర్చిన వారిని, త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్‌లు అధికారులకు తమ నైపుణ్యాలను మెరుగుపర్చే అవకాశం కల్పిస్తాయి. నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు, సాక్ష్యాలను శాస్త్రీయంగా విశ్లేషించేందుకు, ప్రజలకు న్యాయం అందించేందుకు ఈ వృత్తి శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ లు బాలస్వామి, శ్రీనివాస్ తో పాటు జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్ కాలుష్యాన్ని అరికట్టాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్.**

**సత్తుపల్లి, జులై 7: మహా**

గరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో జరుగుతున్న బ్లాస్టింగ్ కారణంగా దుమ్ము కాలుష్యంతో పరిసర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సత్తుపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు స్థానిక సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు వెలికితీత సమయంలో నిర్వహించే భారీ బ్లాస్టింగ్ కారణంగా కిష్టారం, రేజర్ల, కాకర్లపల్లి, సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్ నగర్,ఎన్టీఆర్ కాలనీ, వెంగళరావునగర్ ప్రాంతాలలో ఇళ్ల గోడలకు పగుళ్లు, గాలిలో దుమ్ము వ్యాపించడం వలన వ్యవసాయ పంట పొలాలు దెబ్బతినడంతో పాటు ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రభావంతో రోగాల బారిన పడిన పేద ప్రజలు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అటువంటి ప్రజలకు సింగరేణి సంస్థ మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని కోరారు. సత్తుపల్లి ఉపరితల గని నుండి ఉత్పత్తి చేసే ఒక టన్ను బొగ్గుకు సుమారు 90 రూపాయలు మినరల్ ఫండ్ సింగరేణి ముంపు ప్రాంతాల అభివృద్ధికి సంస్థ జమ చేస్తుందని ఆ నిధులను ప్రభావిత ప్రాంత గ్రామాలకు ఖర్చు చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ఆ నిధులను ఇతర ప్రాంతాలలో ఖర్చు చేయడం సరైనది కాదని హెచ్చరించారు. సత్తుపల్లి ప్రాంతంలో బ్లాస్టింగ్ తీవ్రతను తగ్గించి శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు

# నిర్లక్ష్య ఉపాధ్యాయులపై వేటు

- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ
- వివరాలను వెల్లడించిన డీఈవో

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం గుంపెనగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు సేవా నిబంధనలు ఉల్లంఘించిన నేపథ్యంలో వారిపై కఠిన చర్యలు తీసుకోబడినట్లు జిల్లా విద్యాధికారి డి.వాసంతి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. శ్యామల సత్తిబాబు(ఎస్ జి టి) తరచూ అనుమతి లేకుండా సెలవులు విధులకు హాజరు కాకపోవడం మద్యం సేవించిన స్థితిలో పాఠశాలకు రావడం వంటి ఆరోపణలు ఉన్నట్లు గుర్తించబడిందన్నారు. మామిడి చూడామణి(ఎస్ జిటి) కూడా అనుమతి లేకుండా తరచుగా సెలవులు తీసుకోవడం ద్వారా విద్యా కార్యక్రమాలకు ఆటంకం కలిగించినట్లు నిర్ధారణకు వచ్చిందన్నారు.ఈ చర్యలు విద్యార్థుల విద్యపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు ప్రభుత్వ సేవా నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని అందువల్ల తెలంగాణ సివిల్ సర్వీసెస్(సిసిఏ) నియమావళి 1991 ప్రకారం పై ఇద్దరు ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినట్లు తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని జిల్లా విద్యాధికారి స్పష్టం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. సింగరేణి సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని వికెసీఎం నందు నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్ వికెసీఎం వ్యూ పాయింట్ వద్ద నుంచి ప్రాజెక్టులో జరుగుతున్న ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించారు. ఉత్పత్తి యంత్రాల పనితీరు భద్రతా ప్రమాణాల అమలును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# నగరాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

**బల్దియా కమిషనర్ టి. వెంకన్న**



**మహా వరంగల్ కార్పొరేషన్;** గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. మంగళవారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని నగరాభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల నిర్వహణ, ప్రజా సేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలపై అనధికారికంగా అతికించిన పోస్టర్లు, ప్రకటనలను వెంటనే తొలగించాలని, అలాగే అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటన ఫలకాలను ప్రత్యేక చర్యల ద్వారా తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలను సకాలంలో పరిష్కరించడం ద్వారా నగర సౌందర్యాన్ని గణనీయంగా మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. దెబ్బతిన్న సైకిల్ ట్రాక్‌లను తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉప కమిషనర్లు తమ పరిధిలో పరిపాలనా బాధ్యతలతో పాటు పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ నిర్వహణ తదితర సేవలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి శుక్రవారం తమ పరిధిలోని ఉద్యానవనాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి ఉద్యానవన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రేటర్ నగరాల తరహాలో సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సీఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి, ఇన్‌చార్జి పట్టణ ప్రణాళిక అధికారి రవీందర్ రాడేకర్, జిల్లా అటవీ అధికారి శంకర్ లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, ఉప కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ ఆరోగ్య అధికారి డా. రాజేష్, ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి, కార్య నిర్వాహక ఇంజినీర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మందమర్రిలో డబుల్ బెడ్ రూమ్ గృహాల జాబితాలో అనర్హులు

- పక్కా గృహాలు ఉన్నవారికి సైతం మంజూరు
- కొంతమంది నేతలు 50 వేలకు అమ్మకానికి పెట్టారని ఆరోపణలు..!?
- ఓ మంత్రివర్యా జర జాబితాను పరిశీలించండయ్య

**మందమర్రి, మహా :** మందమర్రి మునిసిపాలిటీలో డబుల్ బెడ్ రూమ్ గృహాల జాబితాలో అనర్హులు.!?కు మంజూరు అయ్యాయనే విమర్శలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. పక్కా గృహాలు ఉన్నవారికి, నేతలకు డబ్బులు ఇచ్చినవారికి సైతం డబుల్ బెడ్ రూమ్ గృహాలు మంజూరు కావడం పట్ల అర్హులైన నిరుపేదలు కంటనీరు పెడుతున్నారు. ఓ పార్టీకి చెందిన కొంతమంది నేతలు ఒక గృహానికి 50 వేల నుండి లక్ష రూపాయలకు అమ్మకానికి పెట్టారని కొంతమంది మహిళలు ఆరోపిస్తున్నారు. అందుకు సంబంధించిన ఆడియో రికార్డును సైతం బయట పెట్టడం గమనార్హం. ఓ మా చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రివర్యా జర మీ వారి ఘనకార్యం, అధికారులు ప్రకటించిన జాబితాను పరిశీలించండయ్య అని మందమర్రి పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే....గత టిఆర్ఎస్ ప్రభుత్వం మందమర్రి మండల కేంద్రంలో దాదాపు 560 డబుల్ బెడ్ రూమ్ గృహాలను నిర్మించింది. అందులో మొదటి దప కొన్ని గృహాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు గత సంవత్సరం పంపిణీ చేసింది. మిగిలిన గృహాలను గత రెండు రోజుల క్రితం అర్హుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో అనర్హులు చాలామంది అర్హులుగా ప్రకటించబడ్డారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ మంజూరులో కొంతమంది నేతలు 50 వేల నుండి లక్ష రూపాయలు అనర్హుల వద్ద తీసుకొని అర్హులుగా ప్రకటించారని పట్టణంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లి వెతుతున్నాయి.

**మందమర్రిలో డబుల్ బెడ్ రూమ్ జాబితాలో అక్రమాలు**

గత రెండు రోజుల క్రితం అధికారులు ప్రకటించిన డబల్ బెడ్ రూమ్ మంజూరు జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని కొంతమంది మహిళలు ఆరోపిస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం నుండి మందమర్రి పట్టణంలో తమకు నివాసం లేదని పేర్కొంటూ సదను కొంతమంది మహిళలు హైదరాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. అయితే వారికి మొదటి జాబితాలో సంబంధిత అధికారులు మొండి చెయ్యి చూపగా రెండవ జాబితాలోనైనా వస్తుందని ఆశించిన వారికి చేదు అనుభవం ఎదురైందని తెలుస్తోంది. కాగా అన్ని అర్హతలు కలిగిన తమకు డబుల్ బెడ్ రూమ్ గృహం అర్హుల జాబితాలో తమ పేరు ఎందుకు లేదని స్థానిక తాసిల్దార్ సతీష్ కుమార్ ను మంగళవారం కార్యాలయంలో ప్రశ్నించగా అది అనర్హుల జాబితా అని తాను చెప్పినట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై స్థానిక తాసిల్దార్ ను మొబైల్ ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

**50 వేల రూపాయలు ఇస్తేనే గృహం మంజూరు**

50 వేల రూపాయలు ఇస్తేనే గృహం మంజూరు జాబితాలో పేరు నమోదు చేపిస్తానని ఒక కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి, మార్కెట్ ప్రాంతానికి చెందిన మరో నేత సదరు కొంతమంది మహిళలను డబ్బులు అడిగినట్లు సమాచారం. సదరు నేతలు అధికార పార్టీ పేరు చెప్పి నిరుపేదల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేసుకొని రెండు చేతుల సంపాదిస్తున్నట్లు విమర్శలు వెల్లి వెతుకుతున్నాయి. ఈ నేతలు చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద పట్టణానికి వచ్చిన సందర్భంలో తనతో సెల్ఫీ ఫోటోలు తీసుకుని వివిధ గ్రూపులలో పెట్టడంతో అది చూసిన ప్రజలు ఆ నాయకుల మాయలో పడిపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి విచారణ జరిపించాలి**

మందమర్రి మునిసిపాలిటీలో గత రెండు రోజుల క్రితం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ గృహాల మంజూరు జాబితాలో ప్రకటించిన 440 మందిపై స్థానిక ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద సదరు జాబితాను రద్దు చేసి, నిష్పక్షపాత విచారణ జరిపి అర్హులకు మాత్రమే ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నారు. మున్సిపాలిటీలో పక్కా నివాస గృహాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికి సైతం ఇళ్లు మంజూరు కావడంతో అర్హులైన నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- 10న జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలి
- విద్యార్థి సంఘాల నాయకుల పిలుపు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాగక్రిష్ణ, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, పీడీఎస్ యు జిల్లా కార్యదర్శి మునిగెల శివప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, పిడిఎస్ యు నాయకులు దుగ్గం ప్రణయ్ లు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఈనెల 10న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో విద్యార్థుల నిరసన ప్రదర్శనను నిర్వహించడం జరిగింది. ప్రదర్శన స్థానిక రైల్వే స్టేషన్ నుండి మొదలై సూపర్ బజార్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ మీదుగా పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటరర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం(నీప్-2020) పేరుతో విద్యను కార్పొరేటీకరణ కాషాయీకరణ దిశగా నడిపిస్తూ పేద మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు తగ్గించడం విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, ఖాళీ పోస్టుల భర్తీ లేకపోవడం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యం, హాస్టళ్లలో సరైన సౌకర్యాల లేమి, మెస్ ఛార్జీల పెంపు చేయకపోవడం వంటి సమస్యలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల కుదింపు, విలీన నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలన్నారు. అవసరమైన చోట కొత్త పాఠశాలలు ప్రారంభించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమ ఫీజులు వసూలు చేయడం పుస్తకాలు యూనిఫాంలు షూస్ టైలు బెల్టు తదితర వస్తువులను పాఠశాలలే మార్కెట్లు అన్నట్లుగా విక్రయించడం ద్వారా తల్లి దండ్రులను దోచుకుంటున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా రంగ ప్రైవేటీకరణ కార్పొరేటీ కరణను నిలిపివేయాలనీ ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించి బలోపేతం చేయాలనీ ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో అన్ని ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ కోరారు. అక్రమ ఫీజులు బలవంతపు పుస్తకాలు యూనిఫాంల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలనీ హాస్టళ్లు మెస్ తాగునీరు పరిశుభ్రత తదితర మౌలిక సౌకర్యాలను మెరుగు పరచాలని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీని వేగవంతం చేయాలనీ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం 10న జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రజా స్వామ్య వాదులు విజయవంతం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మాదాసు అఖిల్, రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినయ్, సంజయ్, పీడీఎస్ యు నాయకులు అరుణ్, పట్టణంలోని విద్యా సంస్థల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత..!

**వాణిజ్య నౌకలపై దాడుల ఆరోపణలు.**

**దుబాయ్, మహా.:** ప్రపంచ చమురు, సహజవాయు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులు జరిగాయి .ఈ ఘటనతో ప్రపంచ సముద్ర వాణిజ్య భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ దాడులపై ఇరాన్ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

**రెండు నౌకలు దెబ్బతిన్నట్లు సమాచారం**

అమెరికా అధికారులను ఉటంకిస్తూ వెలువడిన కథనాల ప్రకారం, ఒమన్ సమీప సముద్ర జలాల్లో రెండు వాణిజ్య నౌకలు దాడులకు గురై పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించినట్లు ఇప్పటివరకు అధికారిక సమాచారం లేదు. అలాగే సముద్ర కాలుష్యానికి సంబంధించిన పెద్ద ప్రమాదం కూడా తలెత్తలేదని ప్రాథమిక వివరాలు సూచిస్తున్నాయి.



**ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు**

అదే సమయంలో ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న ఒక చమురు ట్యాంకర్‌ను గుర్తుతెలియని ప్రొజెక్టైల్ ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో నౌకలో మంటలు చెలరేగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. ఘటన అనంతరం అప్రమత్తమైన సముద్ర భద్రతా సంస్థలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.

**ఆందోళన వ్యక్తం చేసిన అమెరికా**

ఈ ఘటనలపై అమెరికా అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులు వెంటనే నిలిపివేయాలని కోరారు. సముద్ర రవాణా భద్రతకు విఘాతం కలిగించే చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.

**మళ్లీ పెరిగిన ఉద్రిక్తత**

ఇటీవలే హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల భద్రతకు సంబంధించి ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నాలు జరిగినప్పటికీ, తాజా ఘటనలు ఆ ప్రయత్నాలకు ఎదురుదెబ్బగా మారాయి. ఈ పరిణామంతో పశ్చిమాసియా ప్రాంతంలో భద్రతా పరిస్థితులపై అంతర్జాతీయ సమాజం మరింత అప్రమత్తమైంది.

**ప్రపంచ వాణిజ్యానికి కీలక మార్గం**

హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు, సహజవాయు సరఫరాలో అత్యంత కీలకమైన సముద్ర మార్గంగా గుర్తింపు పొందింది. గల్ఫ్ దేశాల నుంచి ప్రపంచ మార్కెట్లకు వెళ్లే ఇంధన సరఫరాలో గణనీయమైన భాగం ఈ జలసంధి ద్వారానే రవాణా అవుతుంది.



# రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్ మహా :** ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం ఈదులసావర్గామ్ నుంచి నిపాని మీదుగా అర్లీ(టీ) వరకు రూ.18 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్ల వ్యయంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మిస్తున్న పనులను ఆయన పరిశీలించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారి పనుల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, త్వరితగతిన రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సయ్య, కాంట్రాక్టర్ నవీన్, సుమన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

**భీంపూర్ మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**ఆదిలాబాద్ మహా:** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పుల్లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన భీంపూర్‌తో పాటు, గోన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, బీఎల్ఓ ద్వారా గ్రామాల వారీగా ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిన గైర్హాజరు, వలస వెళ్లిన వారు, మరణించిన ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని, 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్ల నుంచి 'ఫారం6' ద్వారా దరఖాస్తులు స్వీకరించి, వారి పేర్లను నమోదు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా గోన గ్రామ పంచాయతీ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, సూపర్‌వైజర్లు నర్సింహులు, విజయ్ కుమార్, స్థానిక సర్పంచ్ రంజానతో పాటు బీఎల్ఓలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, ఓటర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు

# ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య

**ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి**
**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడంతో పాటుగా ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సుజాతనగర్ మండలంలో పర్యటించి ప్రభుత్వ పాఠశాల పనితీరుతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల పరిశుభ్రత మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

అనంతరం సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామంలోని పలు వార్డుల్లో ఇంటింటా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్‌వోలు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారం చూపాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# వలిగొండ జూనియర్ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను వెంటనే పూర్తి చేయాలి

- నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ఎస్ఎఫ్ఐ ఆందోళన సిద్ధం
- వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

**వలిగొండ జూలై 7 మహా న్యూస్** వలిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పెండింగ్‌లో ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్టాండ్‌ను పరిశీలించి నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వేముల నాగరాజు మాట్లాడుతూ దాదాపు 12 సంవత్సరాల క్రితం మంజూరైన రిక్వెస్ట్ బస్టాండ్ ఇప్పటికీ పూర్తి కాకపోవడం దురదృష్టకరమన్నారు. వలిగొండ పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు కళాశాల సమయం ముగిసిన తర్వాత ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా విద్యార్థులు కాలినడకనే పట్టణానికి చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు కళాశాల వద్ద కనీసం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా ఆగకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే రిక్వెస్ట్ బస్టాండ్ మంజూరై సంవత్సరాలు గడిచినా, నిర్మాణం పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అప్పట్లో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు ఎమ్మెల్యే వెంటనే స్పందించి రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రిక్వెస్ట్ బస్టాండ్ నిర్మాణ పనులను నెల రోజుల్లో ప్రారంభించకపోతే విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భువనగిరి సాయి, ఉదయ్ కిరణ్ చరణ్ లోకేష్ నరేష్ మనోజ్ సన్య హిమబిందు కృతిక,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

# ఆలేరు అభివృద్ధిని కాంగ్రెస్ పాలకవర్గం అడ్డుకుంటోంది: పుట్ట మల్లేష్

**యాదాద్రి భువనగిరి జూలై 7 మహా**
బీఆర్ఎస్ హయాంలో ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుట్ట మల్లేష్ ఆరోపించారు. ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు అన్ని వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, సీసీ రోడ్లు నిర్మించడం వంటి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజల విశ్వాసంతో అప్పట్లో తొమ్మిది మంది కౌన్సిలర్లు ఘన విజయం సాధించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి దశలో ఆలేరు మున్సిపాలిటీకి మరో రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయించామని, ఆ నిధులతో రూ.3.50 కోట్ల వ్యయంతో మున్సిపల్ భవనం, రూ.2 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం, ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపనలు కూడా నిర్వహించామని చెప్పారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, దుమ్ము ధూళి సమస్య తొలగించేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయ కారణాలతో ఆ పనులను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని ఆరోపించారు. టెండర్ల ప్రక్రియను ఆలస్యం చేసి అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. యాదాద్రి ప్రాంతంలో మాత్రం పనులు కొనసాగగా, ఆలేరులో మాత్రమే నిధులను వినియోగించకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మున్సిపాలిటీకి మరో రూ.15 కోట్ల చొప్పున నిధులు ప్రకటించినప్పటికీ, ఆలేరు అభివృద్ధి మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శించారు. పాత నిధులు, కొత్త నిధులు కలిపి భారీ మొత్తంలో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ఐదు నెలలు గడిచినా



ఒక్క ప్రధాన అభివృద్ధి పని కూడా పూర్తి కాలేదన్నారు. ప్రస్తుత పాలకవర్గం ప్రజా సమస్యలను పక్కనబెట్టి కమిషన్ల రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాలపైనే దృష్టి పెట్టిందని ఆరోపించారు. పాలకవర్గ సభ్యుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, అభివృద్ధి అంశాలపై చర్చించిన తమ కౌన్సిలర్ భర్త మధుపై దాడికి పాల్పడి, అనంతరం తప్పుడు కేసులు నమోదు చేయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. అధికారాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించడం సరైన విధానం కాదన్నారు. వ్యాపారులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వారిని భయభ్రాంతులకు గురిచేసే చర్యలు ఆలేరు అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారాయని అన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర మందగమనంలో ఉందని, ఇలాంటి వ్యవహారాలతో పెట్టుబడిదారులు వెనక్కి తగ్గుతున్నారని పేర్కొన్నారు. చైర్మన్ తన అధికారాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి వినియోగించాల్సిందిపోయి, నేరుగా వ్యాపారుల వద్దకు వెళ్లి ఒత్తిళ్లు తేవడం, డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపించడం బాధాకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందే కానీ, అధికారాన్ని దుర్వినియోగం చేసి భయపెట్టడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత ఉందని, అధికార పార్టీ-ప్రతిపక్షం అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూడాలని సూచించారు. ప్రతీకార రాజకీయాలకు స్వస్తి చెప్పి ఆలేరు అభివృద్ధిపై దృష్టి సారించాలని పుట్ట మల్లేష్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు యాట శివ, కళ్యాణి మధు, టిఆర్ఎస్ నాయకులు బాలస్వామి, బేతి రాములు, పాకాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ టికెట్టు కోసమే ఎమ్మెల్యే పై విమర్శల...

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా..**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి, కాటేదాన్ డివిజన్ పరిధిలో బస్తీ బాట పేరుతో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. గత 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి పనిచేశారు. నేడు కార్పొరేటర్ టికెట్ కోసం బాబుల్ రెడ్డి నగర్, సాయిబాబా నగర్, నేతాజీ నగర్ లో అభివృద్ధి పనులు కనిపించడం లేదంటూ ప్రశ్నించారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా మండిపడ్డారు. ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే కార్పొరేటర్ టికెట్ వస్తుందని భావించడం కేవలం భ్రమ మాత్రమేనన్నారు. 10 సంవత్సరాలుగా కార్పొరేటర్ పదవిలో ఉన్న వ్యక్తిని ప్రశ్నించే ధైర్యం లేక నియోజకవర్గని పర్యవేక్షించే ఎమ్మెల్యేని ప్రశ్నించడం సరైనది కాదని బిఆర్ఎస్ పార్టీ నాయకులను హెచ్చరించారు. మరోసారి ఇలాంటి ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదన్నారు.
ఏమీ లేక ఎగిరెగిరి పడుతున్నారు.



# హిమాయత్ నగర్ గ్రామస్థులకు 60 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించాలి...

- జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబును కలిసి సమస్య వివరించిన మాజీ సర్పంచ్
- సానుకూలంగా స్పందించిన మంత్రి

మొయినాబాద్ మహా: మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ గ్రామస్థులకు అదే రెవెన్యూలోని సర్వేనెంబర్ 151 లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 60 గజాల ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలను అందజేసిందని ఇప్పుడు ఆ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం యత్నిస్తుందని.. ఆ స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని హిమాయత్ నగర్ గ్రామ మాజీ సర్పంచ్ పల్లగొల్ల మల్లేష్ యాదవ్ రంగారెడ్డి జిల్లాఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబును కోరారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్రామస్తులతో కలిసి ఆయన మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ లోని సర్వే నంబర్ 151లో 2007 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 60 గజాల ఇందిరమ్మ పట్టాల స్థలాలకు సంబంధించి వివరించారు. 2007లో 290 కుటుంబాలకు ఇచ్చిన 60గజాల ఇందిరమ్మ పట్టాల స్థలాలను ప్రస్తుతం గుడిమల్కాపూర్ మార్కెట్ కోసం అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సదరు స్థలంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి ఫోను ద్వారా మాట్లాడి హిమాయత్ నగర్ సర్వే నంబర్ 151 లో గతంలో ఇచ్చిన 60గజాల ఇందిరమ్మ పట్టాలు పొందిన లబ్ధిదారులకు తిరిగి ఆ స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్, నాయకులు అశోక్ యాదవ్, వజీర్, మాజీ వార్డు సభ్యులు షాబాద్ దాస్,మాల రాజు, సంగెంరాజు, సదానంద్ గౌడ్, మాల శ్రీను, షాబాద్ సునీల్, షాబాద్ ప్రభుదాస్, ముద్దసిర్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 10 రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల నాయకులు

**మొయినాబాద్ మహా:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.




జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ సతీమణి జానకి శుక్ల...

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సతీమణి జానకి శుక్లా మంగళవారంశంషాబాద్ మండలం ముచ్చింతల్ లోని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ నీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ రామానుజాచార్యుల విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 దివ్య దేశాలను, ఆధ్యాత్మికతను ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. రామానుజాచార్యుల విశిష్టతను ఆశ్రమ ఆచార్యులు ఈ క్షేత్రం ప్రాముఖ్యతను వివరించారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో జానకి శుక్ల శ్రీ రామానుజాచార్యుల బోధనలకు ప్రభావితమయ్యారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలి

**మహా వరంగల్ బ్యూరో;** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యనర్సంపేట లోని 170 పోలింగ్ కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ తో పాటు దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, దుగ్గొండి, గోపాలపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరు పై ఆరా తీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన



అవగాహన కల్పిస్తూ, ఇంటింటి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎస్ ఐ ఆర్ పరిశీలనలో వచ్చిన రైతులతో గ్రామ పరిస్థితి పంటల విస్తీర్ణం ఏఏ పంటలు వేస్తున్నారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి వినియోగం ద్వారా పండించే పంటల కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ వెంట నర్సంపేట ఆర్డీవో ఉమారాణి దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క, నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ విద్యాలయాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. మంగళవారం మంచిర్యాల రాజీవ్ నగర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అందులో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల, వంటగది పనులను మండల విద్యాధికారి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ఏఈఈ (ఈడబ్ల్యూఐడీసీ), కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఇందులో కొనసాగుతున్న నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. వి అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్-2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. బి.ఎల్.ఓ.లు నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పూరింపు ప్రక్రియను పరిశీలించి, అక్కడికి వచ్చిన ఓటర్లతో మాట్లాడారు. ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు .ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా:** గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలతో పాటు వ్యసనగ్రస్తులకు వైద్య చికిత్స అందించి వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. మంగళవారం స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రిమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలు, వ్యసనగ్రస్తులకు అందించనున్న కౌన్సెలింగ్, పునరావాస సేవలపై వైద్య బృందంతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి సరఫరా, విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గంజాయికి బానిసైన వారిని గుర్తించి వారికి శాస్త్రీయ పద్ధతిలో వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్ అందించడం ద్వారా శాశ్వతంగా వ్యసనం నుంచి బయటపడేలా చేయడం అత్యంత అవసరమని అన్నారు. శిక్షతో పాటు సంస్కరణ కూడా సమాజానికి అవసరమని, అందుకే జిల్లా పోలీస్ శాఖ వైద్య శాఖతో సమన్వయం చేసుకొని డిఅడిక్షన్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి సేవించే వ్యక్తులను గుర్తించి, మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్వచ్ఛందంగా డిఅడిక్షన్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చికిత్స అనంతరం మళ్లీ మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా నిరంతర కౌన్సెలింగ్, పర్యవేక్షణ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా వైద్య అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాను నిర్మించగలమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ డా. రాథోడ్ జైసింగ్, డిఅడిక్షన్ సెంటర్‌కు చెందిన సైకాలజిస్టులు, వైద్యులు, సీఐలు కె. నాగరాజు, బి.డి. ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల కృషి మరువలేనిది

- డిసిసి అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల
- ఘనంగా టిజిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నిర్మాణ మహాసభ

**హనుమకొండ మహా;** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) కార్యాలయంలో టిజిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నిర్మాణ మహాసభ ఘనంగా జరిగింది. టిజిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచన మేరకు ఈ సమావేశానికి డిసిసి కార్యాలయంలో అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, సభను ఉద్దేశించి మాట్లాడారు.ఈ మహాసభకు తనను ఆహ్వానించినందుకు ముందుగా వారికి ధన్యవాదాలు తెలుపుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేసిన కృషి ఎనలేనిదని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కొనియాడారు. మనమందరం మిత్రపక్షాలమేనని గుర్తు చేస్తూ, ఆర్టీసీ సిబ్బందికి ఏ అవసరం వచ్చినా, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి




సంపూర్ణంగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గత మేడారం జాతర సందర్భంగా విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి తమ ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భోజన సౌకర్యం కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.తాను కూడా కాలేజీ రోజుల్లో ఎస్ఎఫ్ఐ సెక్రటరీగా పనిచేశానని, అందువల్ల తనకు ఉద్యమాల గురించి, కార్మికుల సమస్యల గురించి పూర్తి అవగాహన ఉందని వివరించారు. అందుకే సిద్ధాంతాలకు కట్టుబడి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని, సమాజంలో అందరికీ న్యాయం జరగాలన్నా, హక్కులు కాపాడబడాలన్నా అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన గుర్తుచేశారు.మహిళల స్వావలంబన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, అలాగే పెట్రోల్ స్టేషన్లు, బస్ స్టేషన్లు, పవర్ స్టేషన్లలో మహిళలకు పెద్దపీట వేస్తూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతుబంధు వంటి పథకాలతో ప్రభుత్వం ప్రజలను ఆదుకుంటోందని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు, కార్మికుల కష్టపడే తత్వం వల్ల ప్రస్తుతం టిజిఎస్ఆర్టిసి లాభాల బాటలో పయనించడం పట్ల ఆయన తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్య నాయకులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రెండో సినిమాకు సిద్ధమవుతున్న సాయిలు కాంపాటి

తొలి సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'తో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ సాధించి, ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన యువ దర్శకుడు సాయిలు కాంపాటి ఇప్పుడు తన రెండో సినిమాకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ నేటివిటీ, సహజమైన ఎమోషన్స్‌తో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే పనిలో పడ్డారు. 'మేమ్ ఫేమస్' ఫేమ్ సుమంత్ ప్రభాస్ హీరోగా రాబోతున్న ఈ క్రేజీ మూవీ విశేషాలు ఇప్పుడు చూద్దాం. మొదటి సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న డైరెక్టర్ సాయిలు కాంపాటి తన రెండో సినిమా ప్రీప్రొడక్షన్ పనులను చాలా వేగంగా జరుపుతున్నారు. ఫిలింనగర్ సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు 'బబ్లూ XXL' అనే డిఫరెంట్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక కథకు పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందనే ఉద్దేశంతోనే ఈ పేరును అనుకుంటున్నారట. ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ టైటిల్ ఇండస్ట్రీ వర్గాల్లో మంచి క్యూరియాసిటీని పెంచుతోంది.

మొదటి సినిమా రిజెక్ట్.. రెండో సినిమాకు ఓకే: నిజానికి సాయిలు కాంపాటి తన మొదటి సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి' కథను కూడా మొదట సుమంత్ ప్రభాస్‌కే వినిపించారట. కానీ అప్పటికే 'మేమ్ ఫేమస్' చిత్రంతో తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో నటించిన సుమంత్, వరుసగా అదే తరహా నేటివిటీ సినిమాలు చేయడం ఇష్టం లేక ఆ ఆఫర్‌ను తిరస్కరించారట. అయితే, ఈసారి సాయిలు రెడీ చేసిన సరికొత్త కథ వినగానే సుమంత్ వెంటనే ఇంప్రెస్ అయి ఓకే చెప్పినట్లు సమాచారం.

భారీ నిర్మాణ సంస్థల కాంబో: ఈ రెండో సినిమా కూడా తెలంగాణ నేపథ్యంలో సాగే ఒక అందమైన ప్రేమకథగానే ఉండబోతోందట. కానీ ఈసారి పాత్రలు, ఎమోషన్స్ మరింత కొత్తగా, మునుపెన్నడూ చూడని విధంగా డిజైన్ చేశారట. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు ఏషియన్ సునీల్, పుష్కూర్ రామ్‌మోహన్ రావు, భరత్ నరంగ్ సంయుక్తంగా SVCLLP బ్యానర్‌పై భారీగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది.



# నా కొడుకు చూసి గర్వపడే మూవీ ఇదే : కాజల్

టాలీవుడ్‌లో సుదీర్ఘ కాలం పాటు స్టార్ హీరోయిన్‌గా వెలుగు వెలిగిన కాజల్ అగర్వాల్ ఇప్పుడు కాస్త జోరు తగ్గిందని చెప్పక తప్పదు. సాధారణంగా పెళ్లి తర్వాత సౌత్ ఇండియన్ ఫిల్మ్ యాక్టర్స్ సినిమాలకు దూరంగా ఉంటారు. కానీ కాజల్ అగర్వాల్ మాత్రం సినిమాల్లో కంటిన్యూ అవుతూనే ఉంది. పెళ్లి తర్వాత చాలా సినిమాలను చేసిన కాజల్ అగర్వాల్ ప్రస్తుతం 'రామాయణం' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. రణబీర్ కపూర్ ఈ సినిమాలో రాముడి పాత్రలో కనిపించబోతుండగా, సాయి పల్లవిని సీత పాత్రలో చూడబోతున్నాం. ఇక కన్నడ రాక్ స్టార్ యశ్ ను ఇప్పటికే రావణ్ పాత్రకు ఎంపిక చేయడం, పలు సీన్స్‌ను షూట్ చేయడం కూడా జరిగింది. సినిమాలో అత్యంత కీలకమైన రావణ్ భార్య మండోదరి పాత్రకు గాను కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటికే మండోదరిగా కాజల్ నటించేసిందికాజల్ అగర్వాల్ తనయుడు నీల్ కిచ్లు... ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ రామాయణం సినిమా గురించి స్పందించింది. భవిష్యత్తులో నా కొడుకు నీల్ కిచ్లు 'రామాయణం'లోని నా పాత్రను చూస్తే తప్పకుండా గర్విస్తాడు. అలాంటి పాత్రను చేయడం చాలా సంతోషంగా ఉంది. నా కొడుకును దృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రస్తుతం సినిమాలను కమిట్ అవుతున్నట్లుగా కాజల్ పేర్కొంది. ప్రస్తుతం నీల్ కిచ్లు చిన్న పిల్లాడే అయినప్పటికీ అతడికి సినిమాల గురించి అవగాహన ఉందని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా నీల్ కి రామాయణం అంటే చాలా ఇష్టం. అందులోని పలు పాత్రల గురించి పదే పదే మాట్లాడుతూ ఉంటాడని కాజల్ చెప్పుకొచ్చింది. రామాయణం కథను ఎంతో ఆసక్తిగా నీల్ కిచ్లు వింటాడని, అలాగే టీవీలోనూ చూస్తాడని, అలాంటి రామాయణం సినిమాలో నేను నటించడం వల్ల నీల్ కిచ్లు కచ్చితంగా గర్విస్తాడని, చాలా సంతోషిస్తాడని కాజల్ అంది.



# అద్భుతమైన ఫ్యాషన్

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో 'సీతామహాలక్ష్మి'గా సుస్థిర స్థానం సంపాదించుకున్న బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్. నటనతోనే కాకుండా తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్, ట్రెడిషనల్ మరియు గ్లామరస్ ఫొటోషూట్‌లతో ఆమె నిత్యం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటారు. ప్రకృతి ఒడిలో, కూల్ లొకేషన్స్‌లో ఆమె తీయించుకునే నేచురల్ ఫొటోలు ఎప్పుడూ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుంటాయి. తాజాగా రాజకుమారిలా మెరిసిపోతున్న ఆమె లేటెస్ట్ ట్రెడిషనల్ లుక్ వైరల్ అవుతుంది.ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో మృణాల్ ఠాకూర్ లుక్ ఎంతో ఎలిగెంట్‌గా, ఒక ప్రిన్సెస్ లాగా ఉంది. ఆమె ఎంతో అద్భుతమైన డిజైన్, ఇంట్రికేట్ డీటైలింగ్ ఉన్న క్రీమ్ అండ్ గోల్డ్ ఎంబ్రాయిడరీ లెహంగాను ధరించారు. ఇక ఈ ఫొటోలో ఆమె ఎంతో హుందాగా ఇచ్చిన పోజ్, ఆమె పదునైన ఫీచర్స్ మరియు గ్లోయింగ్ స్కిన్‌ను మరింత అందంగా ఎలివేట్ చేసింది. దీనికి జత చేసిన సాంప్రదాయ హెవీ జ్యువెలరీ ఈ అవుట్‌ఫిట్‌కు పర్‌ఫెక్ట్ రాయల్ టచ్ ఇచ్చింది. మృణాల్‌కు ఈ బ్యూటిఫుల్ ప్రిన్సెస్ లుక్‌ను అందించడంలో స్టైలిస్ట్స్ అంజలి మరియు స్నేహల్ తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్పితా మెహతా ఈ సరికొత్త రాయల్ అవుట్‌ఫిట్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఇక సాంప్రదాయ దుస్తుల్లో కూడా ఇంత క్లాసీగా, మోడ్రన్‌గా ఎలా కనిపించవచ్చో మృణాల్ ఈ ఫొటోషూట్‌తో మరోసారి నిరూపించారు.

# మీమీ టైమ్‌లో కృతి కీలక నిర్ణయం..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన ఒక ముఖ్యమైన డెసిషన్ ను తొలిసారిగా బహిరంగంగా వెల్లడించారు. మాతృత్వం, మహిళల ఆరోగ్యంపై జరుగుతున్న డిస్కషన్స్ మధ్య ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. కెరీర్‌లో బిజీగా ఉన్న టైమ్ లోనే ఫ్యూచర్ ను దృష్టిలో పెట్టుకుని ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకున్నానని ఆమె తెలిపారు. ఈ డెసిషన్ తనకు మానసిక ప్రశాంతతను ఇచ్చిందని కూడా కృతి పేర్కొన్నారు. రీసెంట్‌గా పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన కృతి, ఈ ప్రక్రియను ఎప్పుడు, ఎందుకు ఎంచుకున్నారో కూడా వివరించారు. మీమీ సినిమా కోసం ప్రత్యేకంగా బరువు పెరగాల్సి వచ్చిన టైమ్ లోనే ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం సరైన నిర్ణయంగా అనిపించిందని చెప్పారు. ఆ ట్రీట్‌మెంట్ వల్ల బాడీలో వచ్చే మార్పులు, సినిమాలోని క్యారెక్టర్ కోసం చేయాల్సిన శారీరక మార్పులు ఒకే టైమ్ లో ఉండటంతో రెండింటినీ కలిపి ప్లాన్ చేసుకున్నానని వెల్లడించారు.

ఎగ్ ఫ్రీజింగ్ అనేది అంత ఈజీ ప్రాసెస్ కాదని, హార్మోన్ల ప్రభావంతో శరీరంలో ఉబ్బరం, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. ఆ టైమ్ లో శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగానూ కొన్ని ఒత్తిడులు అనుభవించానని కృతి వివరించారు. అయితే ఫ్యూచర్ గురించి ఆందోళన లేకుండా ఉండేందుకు ఈ డెసిషన్ తనకెంతో ఉపయోగపడిందని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళల జీవితంలో బయోలాజికల్ క్లాక్ అనే అంశం తరచూ ఒత్తిడికి కారణమవుతుందని, ముఖ్యంగా కెరీర్‌పై దృష్టి పెట్టే వారికి ఇది మరింత సవాలుగా మారుతుందని కృతి పేర్కొన్నారు. ఫ్యామిలీ, సమాజం నుంచి వచ్చే ప్రశ్నల కంటే, తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను మహిళలే స్వతంత్రంగా తీసుకోవాలని ఆమె సూచించారు. తాను కూడా అదే ఆలోచనతో ఈ డెసిషన్ తీసుకున్నానని చెప్పారు.

మీమీ సినిమా కృతికి కెరీర్‌లో స్పెషల్ ఫిల్మ్ గా నిలిచింది. సరోగసీ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమాలో పాత్రకు తగ్గట్టుగా శారీరకంగా ఎంతో కష్టపడిన ఆమె నటనకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కాయి. అదే సినిమాకి జాతీయ ఉత్తమ నటి అవార్డును కూడా కృతి అందుకున్నారు. ఇప్పడదే సినిమా టైమ్‌లో తీసుకున్న మరో వ్యక్తిగత నిర్ణయాన్ని బయటపెట్టడంతో మరోసారి కృతి వార్తల్లో నిలిచారు. దీంతో ఎగ్ ఫ్రీజింగ్ గురించి బహిరంగంగా మాట్లాడిన ప్రముఖ నటీమణుల లిస్ట్ లో కృతి కూడా చేరారు. గతంలో ప్రియాంక చోప్రా, ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి పలువురు కూడా ఈ విషయంపై తమ అనుభవాలను పంచుకున్నారు. మహిళలు తమ ఫ్యామిలీ ప్లానింగ్ ను తమకు అనుకూలమైన సమయంలో రూపొందించుకునేందుకు ఇది ఒక వైద్యపరమైన అవకాశం అని వారు అభిప్రాయపడ్డారు. కృతి చేసిన తాజా కామెంట్స్ మహిళల ఆరోగ్యంపై మరింత అవగాహన పెంచేలా ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. వ్యక్తిగత నిర్ణయాలను దాచిపెట్టకుండా బహిరంగంగా చర్చించడం ద్వారా అపోహలు తగ్గి, సరైన సమాచారం మరింత మందికి చేరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కృతి సనన్ చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ విస్తృత చర్చకు కారణమవుతున్నాయి.



# వెంకీ చేరికతో టెన్షన్ ఫ్రీ..!

2027 సంక్రాంతికి అనిల్ రావిపూడి తన సినిమాతో రావడం ఇప్పటికే కన్ఫర్మ్ అయింది. సంక్రాంతికి వస్తున్నాం, మన శంకరవర ప్రసాద్ గారు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ సంక్రాంతి విజేతగా నిలిచిన అనిల్ రావిపూడి మరో సంక్రాంతి హిట్ కొట్టాలని పట్టుదలతో ఉన్నాడు. ఇప్పటికే వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో అనిల్ రావిపూడి మూవీని ప్రారంభించాడు. కొన్ని రోజుల క్రితం విభిన్నమైన పబ్లిసిటీతో అనిల్ రావిపూడి మూవీ ప్రారంభం అయిందని అందరికీ తెలిసేలా చేశాడు. తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం తనవైపు తిరిగి చూసే విధంగా ఓపెనింగ్ కోసం ప్రమోషన్ వీడియో చేసిన ఘనత అనిల్ రావిపూడికి దక్కింది అనడంలో సందేహం లేదు. సినిమా సంక్రాంతి 2027 కి రావాలి అంటే కచ్చితంగా మూడు నెలల్లో షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అనిల్ కచ్చితంగా సినిమాను పూర్తి చేస్తాడని అంత నమ్మకంగా ఉన్నారు.

అనిల్ రావిపూడి దర్శకత్వంలో సంక్రాంతి మూవీ... అనిల్ కి డేట్లు సరిగ్గా ఇస్తే తప్పకుండా అనుకున్న సమయంకు సినిమాను పూర్తి చేస్తాడని చాలా సార్లు నిరూపితం అయ్యింది. కానీ ఈ సినిమా మల్టీస్టారర్ కావడంతో పాటు, వెంకటేష్ ఈ సినిమా మాత్రమే కాకుండా మరో సినిమాను చేస్తూ ఉండటంతో ఏం జరుగుతుందా అనే టెన్షన్ మొదలైంది. రెండు వారాల క్రితమే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయిన విషయం తెల్సిందే. మొదటి షెడ్యూల్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ మాత్రమే పాల్గొనడంలో వెంకటేష్ రాక గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. వెంకటేష్ మరో వైపు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా షెడ్యూల్ కంటిన్యూ అవుతున్నాయి. అదే సమయంలో అనిల్ మూవీలోనూ వెంకటేష్ నటించాల్సి వస్తుంది. దాంతో రెండు సినిమాలకు గాను



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034